
కూటమి ప్రభుత్వం డ్రైవర్ల సంక్షేమానికి కొత్త పథకం ప్రారంభిస్తోంది. సొంత ఆటో, క్యాబ్ ఆధారంగా జీవిస్తున్న 2,90,669 లబ్ధిదారులకు రూ.436 కోట్ల నిధులను నేరుగా ఖాతాల్లో జమ చేస్తూ సీఎం చంద్రబాబు నేడు ప్రారంభం చేస్తున్నారు.

ఆలపాటి రాజేంద్రప్రసాద్, ఎమ్మెల్సీ



శనివారం 04.10.2025

INK OF TRUTH

# జర్నలిస్ట్ ఫైల్

తెలుగు దినపత్రిక

సంపుటి - 33 సంచిక - 168 www.journalistfile.com పేజీలు 8 వెల : రూ.5.00


# ఆటో డ్రైవర్ సేవలో...

## నేడు ఆటో డ్రైవర్లకు రూ.15 వేలు



- రాష్ట్రంలో మరో కొత్త పథకానికి కూటమి ప్రభుత్వ శ్రీకారం
- ఆటో డ్రైవర్ సేవలో... పథకాన్ని నేడు ప్రారంభించనున్న సీఎం చంద్రబాబు
- సభకు హాజరుకానున్న ఉపముఖ్యమంత్రి, విద్యా శాఖ మంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు

**అమరావతి ( జర్నలిస్ట్ ఫైల్ ):** కూటమి ప్రభుత్వం సంక్షేమం దిశగా మరో అడుగు వేసింది. ఇప్పటికే పెద్దఎత్తున సంక్షేమ పథకాలు అమలు చేస్తున్న ప్రభుత్వం.... ఈ క్రమంలో డ్రైవర్ల సంక్షేమం కోసం 'ఆటో డ్రైవర్ సేవలో...' పథకానికి శ్రీకారం చుట్టనుంది. రాష్ట్రంలోని సొంత ఆటో రిక్షా, మోటార్ క్యాబ్, మ్యాక్సీ క్యాబ్ డ్రైవర్లకు ఆర్థికంగా అండగా నిలబడేందుకు ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ఈ పథకం రూపొందించింది. ఈ పథకం కింద అర్హులైన డ్రైవర్లకు ఏడాదికి రూ.15 వేల చొప్పున ఇవ్వనున్నారు. ఈ పథకాన్ని శనివారం ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రారంభించనున్నారు. విజయవాడ సెంట్రల్ నియోజకవర్గ పరిధిలో ఉదయం 11 గంటలకు జరగనున్న ఈ కార్యక్రమానికి సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, మంత్రి నారా లోకేష్, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్ హాజరుకానున్నారు.

**2.90 లక్షల మందికి రూ.436 కోట్ల లబ్ధి :** సొంత ఆటో, క్యాబ్ కలిగి వాటిపై ఆధారపడి జీవిస్తున్న వారి కోసం రూపొందించిన ఈ పథకానికి రాష్ట్రవ్యాప్తంగా 2,90,669 మంది లబ్ధిదారులను అర్హులుగా గుర్తించారు. వీరి కోసం రాష్ట్ర ప్రభుత్వం రూ.436 కోట్లను కేటాయించింది. ఈ నిధులను నేరుగా డ్రైవర్ల ఖాతాలో ప్రభుత్వం జమ చేయనుంది. గత ప్రభుత్వం ఆటో డ్రైవర్లకు కేవలం ఏడాదికి రూ.10 వేలు మాత్రమే ఇచ్చింది. కానీ కూటమి ప్రభుత్వం గత పాలకులకంటే 50 శాతం అదనంగా రూ.15 వేలు ఇస్తోంది. అలాగే గత ప్రభుత్వం ఈ పథకానికి కేవలం 2,61,516 మందిని మాత్రమే అర్హులుగా గుర్తించి రూ.261.51 కోట్లే ఖర్చు పెట్టింది. గత ప్రభుత్వంతో పోల్చుకుంటే కూటమి సర్కారులో లబ్ధిదారులు సుమారు 30వేల మంది పెరిగారు.. అలాగే డ్రైవర్లకు రూ.175 కోట్లు అదనంగా లబ్ధి చేకూరుతోంది. కూటమి ప్రభుత్వం అందిస్తున్న ఈ పథకంలో ఆటో డ్రైవర్లు 2,25,621 మంది, త్రీ వీలర్ ప్యాసింజర్ వాహనాల డ్రైవర్లు 38,576 మంది, మోటార్ క్యాబ్ డ్రైవర్లు 20,072 మంది, మ్యాక్సి క్యాబ్ డ్రైవర్లు 6,400 మంది ఉన్నారు. విశాఖపట్నం జిల్లాలో అత్యధికంగా 22,955 మంది డ్రైవర్లకు లబ్ధి కలగనుంది.

**హామీ ఇవ్వకున్నా డ్రైవర్లకు లబ్ధి :** వాస్తవంగా చూస్తే ఆటో డ్రైవర్లకు ఏడాదికి రూ.15 వేలు అనే కార్యక్రమం పార్టీ మేనిఫెస్టోలో చెప్పలేదు. అయితే స్త్రీ శక్తి ఉచిత బస్సు పథకం అమలు నేపథ్యంలో ఆటో డ్రైవర్లకు సాయం అందించాలనే ఉద్దేశ్యంతో ప్రభుత్వం ఈ పథకాన్ని ప్రారంభిస్తోంది. ఏ ఒక్క లబ్ధిదారు నష్టపోకూడదని సిఎం స్పష్టం చేయడంతో గతానికంటే ఆర్థిక సాయం పెరగడంతో పాటు.. లబ్ధిదారుల సంఖ్య కూడా గణనీయంగా పెరిగింది. అంతేకాకుండా కూటమి ప్రభుత్వం వచ్చాక వాహనదారులకు మేలు కలిగించేలా పనులు చేపట్టింది. గత ప్రభుత్వంలో ఉన్న రోడ్ల దుస్థితి కారణంగా ఆటో డ్రైవర్లు, వాహనదారులు అనేక సమస్యలు ఎదుర్కొన్నారు. గుంతల రోడ్ల కారణంగా ఆటోలు, ఇతర వాహనాలు దారుణంగా దెబ్బతినేవి. వీటి రిపేర్ల ఖర్చు తడిసిమోపెడు అయ్యేది. అయితే కూటమి ప్రభుత్వం వచ్చాక ఆ సమస్య నుంచి గట్టెక్కించింది. రూ.1,000కోట్లు ఖర్చు చేసి రోడ్ల మరమ్మతులు చేపట్టి సాఫీగా మిగతా 2లో...

## అమరావతిలో పనుల వేగవంతానికి ఎస్పీవీ...



**అమరావతి ( జర్నలిస్ట్ ఫైల్ ):** ఆటో, క్యాబ్ డ్రైవర్లకు రూ.15వేల ఆర్థిక సాయం అందించే పథకాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబు శనివారం లాంఛనంగా ప్రారంభించనున్నారు. విజయవాడ సింగ్ నగర్‌లోని మాకినేని బసవపున్నయ్య స్టేడియంలో ఈ పథకాన్ని సీఎం ప్రారంభిస్తారు. ఈ మేరకు పథకం ప్రతిపాదనలకు రాష్ట్ర మంత్రివర్గం ఆమోదం తెలిపింది. అమరావతి సచివాలయంలో ముఖ్యమంత్రి చంద్రబాబు అధ్యక్షతన కేబినెట్ సమావేశమై 20 అజెండా అంశాలపై చర్చించింది.

ల్యాండ్ ఇన్సెంటివ్ ఫర్ టెక్నికల్ హబ్స్ (లిఫ్ట్) పాలసీ 2024-29 అనుబంధ ప్రతిపాదనలకు మంత్రివర్గం ఆమోదం తెలిపింది. జలవనరుల శాఖకు సంబంధించి వివిధ పనులకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. కారవాన్ పర్యాటకానికి, అమృత్ పథకం 2.0 పనులకు మంత్రివర్గం ఆమోదం తెలిపింది. రాజధాని అమరావతికి భూసేకరణ విషయంలో కేబినెట్ కీలక నిర్ణయం తీసుకుంది. ల్యాండ్ పూలింగ్ ద్వారా ఇవ్వని భూములను భూసేకరణ ద్వారా తీసుకునేందుకు ఆమోదం తెలిపింది. అమరావతిలో వివిధ పనుల వేగవంతానికి స్పెషల్ పర్పస్ వెహికల్ (ఎస్పీవీ) ఏర్పాటుకు ఆమోదముద్ర వేసింది. అమరావతి సహా రాష్ట్రవ్యాప్తంగా పలు సంస్థలకు భూకేటాయింపుల ప్రతిపాదనలకు ఆమోదం తెలిపింది. కుష్ఠు వ్యాధి పదం తొలగించేందుకు వీలుగా చట్టసవరణ చేయాలని నిర్ణయించింది. విద్యుత్ శాఖకు సంబంధించి పలు ప్రతిపాదనలకు, కార్మిక చట్టాల్లో పలు సవరణల ప్రతిపాదనలను మంత్రివర్గం ఆమోదించింది.

## పోలవరం పనుల్లో రాజీ వద్దు



- పుష్కరాల నాటికి పోలవరం ప్రాజెక్టు పూర్తి చేయండి
- 2026 జనవరి కల్లా ఎడమ కాలువ పనులు పూర్తి కావాలి
- ఈ ఏడాది నవంబరు నుంచే ప్రధాన డ్యామ్ పనులు మొదలు పెట్టండి
- పోలవరం ప్రాజెక్టుపై జల వనరుల శాఖ సమీక్షలో ముఖ్యమంత్రి చంద్రబాబు

**అమరావతి ( జర్నలిస్ట్ ఫైల్ ):** గోదావరి పుష్కరాల నాటికి పోలవరం ప్రాజెక్టు పూర్తి కావాలనే లక్ష్యంతో పనులు చేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అధికారులను, కాంట్రాక్టు సంస్థలను ఆదేశించారు. నిర్దేశిత గడువులోగా లక్ష్యానికి అనుగుణంగా వేగంగా పనులు పూర్తి చేయాలని సీఎం సూచించారు. సచివాలయంలో శుక్రవారం పోలవరం ప్రాజెక్టు పనుల పురోగతిపై ముఖ్యమంత్రి సమీక్ష నిర్వహించారు. కేంద్ర జలసంఘం, నిపుణుల కమిటీ నుంచి ఎప్పటికప్పుడు ప్రాజెక్టు పనులపై అనుమతులు తీసుకుని పనుల్ని పూర్తి చేయాలని ఆదేశించారు. మిగతా 2లో...

## అమరావతిలో పెట్టుబడులు



**అమరావతి ( జర్నలిస్ట్ ఫైల్ ):**అమరావతిలో రాబోయే ఐదేళ్లలో 6వేల నుంచి 10 వేల కోట్లు పెట్టుబడులు పెట్టేందుకు మలేషియా కంపెనీలు ఆసక్తి కనబరిచాయి. ఈ నెల ఒకటో తేదీ నుంచి మలేషియా బృందం అక్కడి మంత్రి,ఎంపీతో కలిసి అమరావతిలో పర్యటిస్తుంది.. పర్యటనలో భాగంగా మలేషియా ప్రతినిధులతో కలిసి మంత్రి నారాయణ అమరావతి నిర్మాణ పనులు జరుగుతున్న తీరును పరిశీలించారు...ఆ తర్వాత సచివాలయంలో వారితో భేటీ అయ్యారు... ఈ భేటీలో మలేషియా లోని సెలాంగార్ స్టేట్ ఎక్స్ కో మంత్రి వ ప్పారాయుడు, క్లాంగ్ ఎంపీ గనబతిరావ్, మలేషియా - ఆంధ్రా బిజినెస్ చాంబర్ ప్రతినిధులు,పలు ప్రయివేట్ సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు..అమరావతి అభివృద్ధికి భారత్ తో కలిసి పనిచేస్తామని మలేషియా మంత్రి పప్పారాయుడు తెలిపారు. ముఖ్యంగా మలేషియా లో తెలుగు మూలాలు ఉన్న పారిశ్రామిక వేత్తలకు చెందిన పలు కంపెనీల ప్రతినిధులు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా తమ ప్రాజెక్ట్ ల గురించి మంత్రి నారాయణకు వివరించారు... ప్రధానంగా ఐదు కీలక సెక్టార్ లలో పెట్టుబడులు పెట్టేందుకు ఆయా కంపెనీలు ముందుకొచ్చాయి.. ఎడ్యుకేషన్, టూరిజం - హాస్పిటాలిటీ, ట్రేడ్ అండ్ కామర్స్,రియల్ ఎస్టేట్ (టెక్నాలజీ ట్రాన్స్ ఫర్,అభివృద్ధి, మౌళిక వసతులు కల్పన), తెలుగు సంస్కృతి, సంప్రదాయాలకు చెందిన వివిధ ప్రాజెక్ట్ ల్లో పెట్టుబడులకు ఆసక్తి కనబరిచారు. అమరావతిలో మెడికల్ యూని వర్శిటీ ఏర్పాటుకు మలేషియా లోని సైబర్ జయ యూని వర్శిటీ ముందు కొచ్చింది... అలాగే ఫైవ్ స్టార్ హెూటల్స్ ఏర్పాటుకు బెర్జయ గ్రూప్ ముందు కొచ్చింది. మిగతా 2లో...

## పేదలకు భారీ ఊరట

- రూ.1 తోనే 50 గజాల్లోపు ఇళ్ల నిర్మాణ అనుమతి
- ఆన్లైన్ లో దరఖాస్తు చేసి రూ1 చెల్లించాలి



**ఉమ్మడి గుంటూరు జిల్లా బ్యూరో (జర్నలిస్ట్ ఫైల్)** ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం పేద, మధ్యతరగతి కుటుంబాలకు దసరా కానుకగా అదిరిపోయే శుభవార్త చెప్పింది. 50 గజాల్లోపు ఇళ్ల నిర్మాణ అనుమతి ఫీజును కేవలం రూపాయికి తగ్గించింది. దీంతో ఏటా రూ.6 కోట్ల భారం తగ్గుతుంది. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకుని, రూపాయి చెల్లిస్తే చాలు. ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన అవసరం లేకుండానే అనుమతులు వస్తాయి. అయితే కొన్ని షరతులు కూడా ఉన్నాయి. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం పేద, మధ్య తరగతి కుటుంబాలకు దసరా కానుకను ప్రకటించింది. 50 చదరపు గజాల్లోపు విస్తీర్ణంలో కట్టే G+1 లేదా అంతకంటే తక్కువ ఇళ్లకు నిర్మాణ అనుమతి ఫీజును కేవలం రూపాయిగా నిర్ణయించింది. ఈ నిర్ణయంతో ప్రజలకు ఏటా రూ.6 కోట్ల ఫీజుల భారం తగ్గుతుంది. పురపాలక శాఖ ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేసింది. దరఖాస్తుతోపాటు ఇంటి డ్రాయింగ్‌ను ఆన్‌లైన్ పోర్టల్‌లో అప్‌లోడ్ చేసి రూపాయి ఫీజు చెల్లిస్తే అనుమతులు ఇస్తారు. ప్రస్తుతం పేద, మధ్య తరగతి కుటుంబాలు రెండంతస్తుల ఇళ్లకు రూ.3 వేల నుంచి రూ.4 వేల వరకు ఫీజులు కడుతున్నారు.

ఈ కొత్త నిర్ణయంతో వారికి ఆ భారం పూర్తిగా తొలగిపోతుంది. మిగతా 2లో...

## రూ.4 లక్షల ఎక్స్ గ్రేషియా

- భారీ వర్షాల మృతుల కుటుంబాల ఆదుకుంటున్న కూటమి ప్రభుత్వం
- దెబ్బతిన్న రహదారులు, విద్యుత్ వెంటనే పునరుద్ధరించాలి
- ఉత్తరాంధ్ర జిల్లాల్లో వర్షాలు, వరదలపై సమీక్షలో సీఎం చంద్రబాబు

**అమరావతి ( జర్నలిస్ట్ ఫైల్ ):** ఉత్తరాంధ్ర జిల్లాల్లో భారీ వర్షాలు, వరదల కారణంగా దెబ్బతిన్న రహదారులు, విద్యుత్ ను వెంటనే పునరుద్ధరించాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అధికారులను ఆదేశించారు. శుక్రవారం సచివాలయంలో ఉత్తరాంధ్ర జిల్లాల్లో వర్షాలు, వరద ప్రవాహాలపై ఉన్నతాధికారులు, ఆయా జిల్లాల కలెక్టర్లతో సీఎం సమీక్ష నిర్వహించారు. సమీక్షకు శ్రీకాకుళం, విజయనగరం, విశాఖ జిల్లాల కలెక్టర్లు వీడియో కాన్ఫరెన్సు ద్వారా హాజరయ్యారు. ప్రస్తుతం ఆయా జిల్లాల్లో నెలకొన్న పరిస్థితులను ముఖ్యమంత్రి అడిగి తెలుసుకున్నారు. ప్రస్తుతం గొట్టా బ్యారేజి, తోటపల్లి బ్యారేజీ పరిధిలో భారీ ఎత్తున వర్షపాతం నమోదైందని అధికారులు తెలిపారు. గొట్టా బ్యారేజికి 1.89 లక్షల క్యూసెక్కులు, తోటపల్లికి 44 వేల క్యూసెక్కుల వరద వస్తోందని శ్రీకాకుళం జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ ముఖ్యమంత్రికి వివరించారు. ఒడిశాలోని వేర్వేరు ప్రాంతాల్లో కురిసిన భారీ వర్షాల కారణంగా వంశధార నదికి 1.05 లక్షల క్యూసెక్కుల నీరు వస్తోందని తెలిపారు. భారీ వర్షాలు, ప్రమాదాల కారణంగా మూడు జిల్లాల్లో నలుగురు మృతి చెందినట్టు అధికారులు ముఖ్యమంత్రి దృష్టికి తెచ్చారు. విశాఖ నగరం కంచరపాలెంలో ఒకరు, శ్రీకాకుళం జిల్లా మందసలో ఇద్దరు, మిగతా 2లో...



## పంటల నష్టాన్ని అంచనా వేయండి

- వ్యవసాయ, హార్టికల్చర్ ఉన్నతాధికారులతో టెలికాన్ఫరెన్స్
- రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు
- ఉత్తరాంధ్ర, కోస్తా జిల్లాల ఉన్నతాధికారులు అప్రమత్తంగా ఉండాలని సూచన



**అమరావతి ( జర్నలిస్ట్ ఫైల్ ):** ఒడిశా రాష్ట్రంలోని గోపాల్‌పూర్ సమీపంలో ఏర్పడిన తీవ్ర వాయుగుండం ప్రభావంతో ఉత్తరాంధ్ర, కోస్తా జిల్లాల్లో విస్తృతంగా వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు శుక్రవారం వ్యవసాయ, హార్టికల్చర్ ఉన్నతాధికారులతో అత్యవసర టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి అచ్చెన్నాయుడు మాట్లాడుతూ భారీ వర్షాల కారణంగా పంటలు దెబ్బతినే అవకాశం ఉందని, వ్యవసాయ మరియు హార్టికల్చర్ అధికారులు తక్షణమే ఫీల్డ్‌లోకి దిగి పంటల నష్టాన్ని ప్రాథమికంగా అంచనా వేయాలని ఆదేశించారు. అవసరమైతే ఇతర జిల్లాల సిబ్బందిని కూడా ఉత్తరాంధ్ర, కోస్తా జిల్లాలకు తరలించి పంటల అంచనాలు వేయడంలో, రైతులకు సహాయం చేయడంలో వినియోగించుకోవాలని స్పష్టం చేశారు. వాయుగుండం ప్రభావం తగ్గిన తరువాత ఆకస్మిక వరదలు వచ్చే అవకాశం ఉందని అధికారులు, సిబ్బంది మరింత అప్రమత్తంగా వ్యవహరించాలని సూచించారు.

## రూ. 500 కోట్ల పెట్టుబడులు

- మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డితో ఫ్లైయింగ్ వెడ్జ్ డిఫెన్స్ & ఏరోస్పేస్ ప్రతినిధుల భేటీ
- అనంతపురంలో కొత్త పెట్టుబడులతో యువతకు అవకాశాలు



**అమరావతి ( జర్నలిస్ట్ ఫైల్ ):** ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో డిఫెన్స్ &ఏరోస్పేస్ పరిశ్రమ అభివృద్ధికి మరో మెట్టు చేరనుంది. ఫ్లైయింగ్ వెడ్జ్ డిఫెన్స్ & ఏరోస్పేస్ సంస్థ ప్రతినిధులు నేడు సచివాలయంలో మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డిను కలిశారు. భేటీలో వారు రాష్ట్రంలో అటానమస్ కాంబాట్స్ ఎయిర్ క్రాఫ్ట్ మ్యానుఫ్యాక్చరింగ్ & టెస్టింగ్ ఫెసిలిటీ ఏర్పాటు చేయాలనే ఆసక్తి వ్యక్తం చేశారు. మిగతా 2లో...

# సంపాదకీయం

## ఆరోగ్య ఆంధ్ర ప్రదేశ్ మన లక్ష్యం కావాలి



వైద్య రంగంలో రాష్ట్రాన్ని అగ్రగామిగా తీర్చిదిద్దాలనే ఆలోచనలో రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు. అన్ని రంగాల్లో రాష్ట్రం దేశంలోని ముందంజలో ఉండాలానే అభిప్రాయం ఆయన తరచూ వ్యక్తం చేస్తూ ఉంటారు. దీనికి తగ్గట్లుగానే ఆయన ప్రణాళికలు సిద్ధం చేస్తూ ఉంటారు. ఆయన నిర్ణయాలు, ప్రణాళికలను అమలు చేస్తూ ముందుకు సాగుతూ ఉంటారు. అన్ని రంగాల్లో ఏపీ మొదటి స్థానంలో ఉండాలనే ఆలోచనతో ఐఏఎస్ మొదలు దిగువ స్థాయి అధికారుల వరకు పరుగులు పెట్టిస్తూ ఉంటారు. దీనివల్ల మంచి ఫలితాలు వస్తున్నాయి.

దేశంలోనే మొదటి స్థానంలో ఉండాలని చెబుతారు కదా ఏపీ ఎప్పుడూ టాప్ ప్లేస్ లోనే ఉండాలని కూడా గట్టిగా కోరుతూంటారు.

కానీ ముఖ్యమంత్రి చంద్రబాబు ఎపుడూ ఏపీ నెంబర్ వన్ గా ఉండాలని ఆకాంక్షించే నాయకుడే. అయితే అదే సమయంలో ఆయన రాష్ట్రాన్ని ఇబ్బంది పెట్టే అంశాలలో రాష్ట్రం జీరో ర్యాంక్ లోనే ఉండాలని కోరుకుంటారు. ప్రజా కోణం లో నుంచి చూసి ఆలోచించే నాయకుల తీరు అలాగే ఉంటుంది. అందుకే నిండు సభలో బాబు ఏపీకి నెంబర్ వన్ ప్లేసా వద్దే వద్దు అని అంటున్నారు. తరచూ అసెంబ్లీలో ఆయన మాట్లాడిన తీరు ఆసక్తికరంగా ఉంటుంది. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఆరోగ్యకరమైన ఆంధ్రప్రదేశ్ కావాలని తొలి నుంచి గట్టిగా కోరుకుంటారు. ఇందుకు తగ్గట్లుగానే ఆయన ఆలోచన విధానం ఉంటుంది. రోగాలు లేని ఆంధ్రప్రదేశ్ కావాలని కోరుకుంటూ ఆయన అసెంబ్లీలో చక్కగా మాట్లాడారు. ఒక విధంగా చెప్పాలంటే అధికారులకు దిశా నిర్దేశం చేసినట్లే. చంద్రబాబు నాయుడు మాట్లాడిన విధానం పై అధికారులు కూడా చక్కగా రెస్పాండ్ అవుతున్నారు.

రాష్ట్ర అసెంబ్లీలో మంగళవారం వైద్య ఆరోగ్య శాఖ మీద జరిగిన చర్చలో ముఖ్యమంత్రి చంద్రబాబు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కూటమి ప్రభుత్వం ప్రజా ఆరోగ్యం మీద పెడుతున్న శ్రద్ధ గురించి సర్కార్ తీసుకుంటున్న చర్యల గురించి చక్కగా, అధికారులు ఆలోచించేలా చేసింది అనటంలో ఎలాంటి సందేహం లేదు. అదే సమయంలో ఆయన వైద్య విధానం పై మాట్లాడుతూ కొన్ని అంశాల్లో ఆవేదన కూడా వ్యక్తం చేయటం గమనార్హం. వాటి తీరు మారాలన్నది ఆయన ఆలోచనా విధానంగా అదే సర్కార్ లక్ష్యంగా అని చెప్పారు.

ఇక రాష్ట్రంలో ఆరోగ్య సంరక్షణ కానీ ప్రమాణాలు పరిశీలిస్తే కనుక ప్రపంచ ఆరోగ్య సంస్థ ప్రమాణాల కంటే మెరుగ్గా ఏపీలో ఆరోగ్య మౌలిక వసతుల కల్పన ఉందని సీఎం వివరించారు. కొన్ని వివరాలను స్టాటిస్టికల్ గా ఆయన చెప్పడం విశేషం.

రాష్ట్రంలో ఉన్న వైద్యాధికారుల వివరాలు కూడా వివరించారు. దాదాపు 1,15,499 మంది డాక్టర్లు అలాగే, 70043 మంది నర్సులు ఈ విషయంలో దేశంలోనే ముందంజలో ఉన్నామనే లెక్కలు ఆయన చెప్పారు. ప్రపంచ ఆరోగ్య సంస్థ లెక్కల ప్రకారం ప్రస్తుతం. దేశంలో చూస్తే కనుక పౌరుల సగటు జీవిత కాలం 70 ఏళ్లుగా ఉంది అదే విధంగా రాష్ట్ర వ్యాప్తంగా 78 శాతం డిజిటల్ హెల్త్ రికార్డులు తయారు చేశారు., అతి త్వరలో ప్రజల హెల్త్ రికార్డులు కూడా తయారు చేస్తున్నారు. ఇక ఈ ఆరోగ్య రికార్డులను 100 శాతం డిజిటలైజ్ చేసేలా కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకుంటుంది. ఇందుకోసం అధునాతన వైద్య సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించాలని నిర్ణయించారు. ఈ దిశగా కసరత్తు సాగుతోంది. సిజేరియన్ ఆపరేషన్ విధానంపై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఒక విధంగా చెప్పాలంటే తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. గత కొన్ని సంవత్సరాలతో పోల్చుకుంటే ఇప్పుడు సాధారణమైన కాన్పులను చేయవచ్చు కదా... సహజంగా మనకు ఇచ్చిన దేహాన్ని కట్ చేసి సిజేరియన్ ఆపరేషన్లు చేయటం మన వైద్య విధానంలోనే ప్రధాన లోపం గా ఉందని ఆయన ఒకింత ఆవేదన కూడా వ్యక్తం చేశారు. వైద్యరంగంలో ఎంతో ప్రావీణ్యత సంపాదించిన రాష్ట్రంలో గర్భిణీలకు సాధారణ ప్రసవానికి మార్గాలను అన్వేషించాల్సిన బాధ్యత వైద్యులపై ఉందన.టంలో ఎలాంటి అతిశయోక్తి లేదు. సీజేరియన్ కాన్పులలో నెంబర్ వన్ : అదన్న మాట బాబు మాటల్లో వ్యక్తం కావడంతో పాటు దీనిపై సభలు కొంత ఆవేదన కూడా వ్యక్తం చేశారు.. బాబు అసెంబ్లీలో వద్దు అన్నది కూడా ఇదే. దేశంలో చూసుకుంటే మన రాష్ట్రం సిజేరియన్ కాన్పులలో నంబర్ వన్ గా ఉందట. ఇది గణాంకాల లెక్కలను బట్టి తెలుస్తోంది. ఇది చాలా బాధాకరమైన విషయం.. ఏపీలో చూసుకుంటే ఇటీవల కాలంలో డాక్టర్లు సిజేరియన్ కాన్పులు ఎక్కువగా చేస్తున్నారు. ప్రతి చోట ఇదే పద్ధతి ఉంది. దీన్ని మార్చాల్సిన అవసరం వైద్యులపై కూడా ఉంది. ఇక ప్రభుత్వ ఆసుపత్రులలో తప్పని పరిస్థితుల్లో 10 శాతం సిజేరియన్ ఆపరేషన్. జరుగుతూంటే 90 శాతానికి పైగా సిజేరియన్లు ప్రైవేట్ ఆస్పత్రుల్లో ఈ వివరాలు ప్రభుత్వం వద్ద కూడా ఉన్నాయి.

**అవసరం లేకపోయినా సిజేరియన్ ఎందుకు :** అవసరం లేకపోయినా సిజేరియన్ ఆపరేషన్ లు చేయడం వల్ల అనేకమంది గర్భిణీ స్త్రీలను మానసిక వేదనకు గురవుతున్నారు. ఇది వాస్తవం కూడా.

దీనిపై శాసనసభలో సీఎం చంద్రబాబు నిండు సభలో చేసిన కొన్ని వ్యాఖ్యలు అందరినీ ఆలోచింపచేసేలా ఉన్నాయి. ఆయన ఆవేదన మహిళల ఆరోగ్యం పట్ల ప్రభుత్వానికి ఉన్న శ్రద్ధ కూడా వ్యక్తం అయింది. భగవంతుడు ఇచ్చిన శరీరానికి అనవసరంగా ఆపరేషన్లు చేయడం సరికాదని బాబు స్పష్టం చేశారు. తేదీలు చెప్పి మరీ సిజేరియన్లు చేస్తున్నారని బాబు ఒకింత అసహనం వ్యక్తం చేశారు. ముహుర్తాలు పెట్టుకుని సీజేరియన్ ఆపరేషన్లు చేసే పరిస్థితి వచ్చిందని ఆయన సభ దృష్టికి తెచ్చారు. ఇది సభలో ఉన్న ఐఏఎస్, వైద్య విధాన పరిషత్, ప్రముఖ డాక్టర్లను ఆలోచింపచేసేదిలా ఉంది. రాష్ట్రవ్యాప్తంగా

సీజేరియన్ ఆపరేషన్లను పూర్తిగా తగ్గించాలి. మహిళల ఆరోగ్యానికి భద్రత కల్పించాల్సిన బాధ్యత ఉంది. దీనిపై

వైద్యారోగ్య శాఖ మంత్రి ప్రణాళికలు తయారు చేయాల్సిన అవసరం కూడా ఉంది. దీనిపై ప్రైవేటు వైద్యశాలల డాక్టర్లను కూడా అప్రమత్తం చేయాల్సిన అవసరం ఎంతో ఉంది. వచ్చే ఏడాది నాటికి సిజేరియన్ ఆపరేషన్ తగ్గిన చర్యలు కూడా తీసుకోవాలి. ప్రస్తుత వైద్య విధానంలో టెక్నాలజీ బాగా ఉన్నప్పుడు సిజేరియన్ ఆపరేషన్ దేనికని అంశం కూడా తెరపైకి ఒక ప్రశ్నగా వస్తోంది. రాష్ట్ర ప్రభుత్వం తరఫున శాసనసభ నుంచి ముఖ్యమంత్రి ఒక కీలకమైన కచ్చితమైన సందేశాన్ని కూడా ఏపీలోని వైద్యులకు పంపించారు. సాధారణ కాన్పులు జరిగేలా డాక్టర్లు శ్రద్ధ తీసుకుంటే ఎంతో మంచిదని చెబుతున్నారు. ప్రైవేటు డాక్టర్లు కూడా ఈ విధానంపై ఆలోచించాలి. తేదీలు పెట్టి సిజేరియన్ చేసే విధానానికి స్వస్తి పలకాలి. ప్రభుత్వ విధానాన్ని, సిజేరియన్ ఆపరేషన్ లపై సీఎం చంద్రబాబు ఆవేదనను కూడా అర్థం చేసుకోవాలి.

రాష్ట్రంలో సిజేరియన్ కాన్పుల విషయంలో అంతా వెనకడుగు వేయాలి. ఈ తరహా ఆపరేషన్లను జీరో నెంబర్ కి తీసుకుని రావాలి. అప్పుడే మనం, మన వైద్యం దేశంలోనే కాకుండా ప్రపంచ స్థాయిలోనూ మంచి గుర్తింపు పొందుతుంది.

**-అజయ్ చంద్ర, ఎడిటర్, జర్నలిస్ట్ ఫైల్**

# అయ్యో.. నోబెల్ వస్తుందా.. రాదా?:

- **ట్రంప్‌నకు అక్టోబర్ 10 టెన్షన్!**
- **తనకు దక్కకపోతే అమెరికాకు అవమానం అంటున్న ట్రంప్**
- **కొత్త సమస్యతో అగ్రరాజ్యాధినేత**



**ఉమ్మడి గుంటూరు జిల్లా బ్యూరో (జర్నలిస్ట్ ఫైల్)** : ప్రపంచ స్థాయి నేతలు తమ బలహీనతల్ని, ఆశలని, లక్ష్యాలని బహిర్గతం చేయరు. ఎందుకంటే.. ఇతర దేశాలు వాటిని తమకు అనుకూలంగా వాడుకొంటాయని. అయితే ట్రంప్ వంటి తెంపరి నేతలు మాత్రం తమకు ఏం కావాలో ఎటువంటి బెరుకు లేకుండా వేదికల పైకి ఎక్కిమరీ డిమాండ్ చేస్తుంటారు. ఇలాంటి చర్యలు వ్యక్తిగతంగా వారి స్థాయిని దిగజార్చడంతో పాటు.. ఆ దేశానికి ఇబ్బందులు తెస్తాయి. ట్రంప్ నోబెల్ కల ఇప్పుడు అమెరికాకు తలనొప్పిగా మారుతోంది. అవార్డు వస్తుందో, రాదో తెలియదు కానీ, అధ్యక్షుడిగా అనవసర విభేదాలు, వెక్కిరింతలను ఎదుర్కోవాల్సి వస్తోంది. అక్టోబర్ 10న నోబెల్ శాంతి బహుమతి విజేతను ప్రకటించనున్నారు. ఈనేపథ్యంలో ట్రంప్ టెన్షన్ పెరిగిపోయి.. ఏకంగా ఆ బహుమతి ఇచ్చే కమిటీని కూడా టార్గెట్ చేసి వ్యాఖ్యలు చేశారు.

**మద్దతు ఇచ్చేది ఎవరు..?** : ట్రంప్‌నకు నోబెల్ ప్రైజ్ దక్కాలని బల్లగుద్ది వాదించే వారిలో పాక్ నేతలు ముందున్నారు. ట్రంప్ ఆరాటాన్ని గమనించిన పాక్ సైన్యాధిపతి మునీర్ దానిని తమకు అనుకూలంగా మలుచుకొన్నారు. అంతర్జాతీయ ఉగ్రవాదులను కడుపులో పెట్టి చూసుకొంటున్న తమ దేశం నుంచి నోబెల్ బహుమతికి నామినేషన్ పంపించారు. భారత్-పాక్ మధ్య ట్రంప్ మధ్యవర్తిత్వం వహించారని కూడా సర్టిఫికెట్ ఇచ్చారు. ఫలితంగా పాక్‌కు అవసరమైన నిధులు, సాయం వంటివి తెచ్చుకోగలుగుతున్నారు.

ఇజ్రాయెల్ అధినేత నెతన్యాహు గాజాలో అవసరానికి మించి కఠినత్వం ప్రదర్శించి ప్రపంచవ్యాప్తంగా విమర్శలు ఎదుర్కొంటున్నారు. బైడెన్ సర్కారు ఇజ్రాయెల్‌కు ఆయుధ సరఫరా నిలిపివేయగా.. ట్రంప్ వచ్చాక వాటిని పునరుద్ధరించారు. ఇరాన్, హమాస్‌ను అణిచివేసేందుకు సహకరించారు. ట్రంప్ అభిమానం చూరగొనేందుకు నెతన్యాహు కూడా నోబెల్ రాగం అందుకొన్నారు. అరబ్ ప్రపంచం నుంచి ఇజ్రాయెల్‌పై వ్యతిరేకత రాకుండా అమెరికా అడ్డుకుంటోంది. ఇదే అదునుగా ఖతార్‌పై యుద్ధ విమానాలతో ఇజ్రాయెల్ విరుచుకుపడింది. దీంతో అరబ్ ప్రపంచం షాక్‌కు గురైంది. కానీ, అమెరికా అండ ఉండటంతో ఏమీ చేయలేకపోయింది.

ఇటీవల శ్వేతసౌధం సందర్శన వేళ ఇజ్రాయెల్ నుంచి వెళ్లిన నోబెల్ నామినేషన్ పత్రాన్ని నెతన్యాహు స్వయంగా ట్రంప్‌నకు బహూకరించారు. శాంతి బహుమతికి సమస్య రాకూడదని నెతన్యాహు ఖతార్‌కు ముక్తసరిగా క్షమాపణలు చెప్పి.. ట్రంప్‌ను ప్రసన్నం చేసుకొన్నారు. ఈ దాడి విషయం తెలిసి ఊరుకొందీ.. ఆ తర్వాత సముదాయిస్తూ క్షమాపణ చెప్పించిందీ ట్రంప్ కార్యవర్గమే. ఇటీవల ఘర్షణలు జరిగిన దేశాలకు సంబంధించిన నేతలే ట్రంప్‌ను నామినేట్ చేసిన వారిలో ఎక్కువగా ఉన్నారు. కంబోడియా, అర్మేనియా, అజర్ బైజాన్, రువాండ వంటి దేశాధినేతలు వీరిలో ఉన్నారు. అయితే జనవరి 31 లోపు వచ్చిన దరఖాస్తులనే పరిశీలిస్తారని ఇటీవల రాయిటర్స్ వెల్లడించింది. ఇదే నిజమైతే.. పాక్ సహా పలు దేశాలు పంపిన నామినేషన్లతో ప్రయోజనం ఉండదు. ఇదిలాఉండగా, ఉక్రెయిన్ అధినేత జెలెన్‌స్కీనుంచి ఇప్పటివరకూ ట్రంప్‌నకు అనుకూలంగా కచ్చితమైన ప్రకటన వెలువడకపోవడం గమనార్హం.

**వెక్కిరింతలు.. విభేదాలు..!** : ఇతర దేశాల వారు మద్దతు ఇవ్వడం లేదని ట్రంప్ అంటున్నారు కానీ స్వదేశంలో కూడా అనుకూలత లేదు. ట్రంప్ నోబెల్ శాంతి బహుమతికి అర్హుడు కాదని 76 శాతం అమెరికన్లు అనుకుంటున్నారు. న్యూ వాషింగ్టన్ పోస్ట్ - ఇప్సాస్ పోల్ ఈ విషయం తెలిపింది. కేవలం 22 శాతం ఆయనకు మద్దతు ఇచ్చారు. రిపబ్లికన్లలోనే 49 శాతం మంది మద్దతు ఇవ్వగా.. మరో 49 శాతం మంది వ్యతిరేకిస్తుండటం గమనార్హం.

ఇటీవల ట్రంప్ నోబెల్ కోసం తపించడంపై ఫ్రాన్స్ అధ్యక్షుడు ఇమ్మానియేలు మేక్రాన్ సెటైర్లు వేశారు. ఆయనకు నోబెల్ ప్రైజు కావాలంటే.. ముందు ఇజ్రాయెల్‌ను కట్టడి చేయాలన్నారు. గాజా యుద్ధాన్ని ఆపితేనే నోబెల్ సాధ్యమని తేల్చి చెప్పారు. మరోవైపు మరో వారంలో శాంతి బహుమతిని ప్రకటించనుండటంతో.. ట్రంప్‌లో టెన్షన్ పెరిగిపోతోంది. గాజాపై అర్జెంట్‌గా సంధి ప్రతిపాదనలు సిద్ధం చేయించి.. ఇజ్రాయెల్, అరబ్ దేశాలతో ఆమోద ముద్ర వేయించారు. హమాస్‌కు అతితక్కువ డెడ్‌లైన్ ఇచ్చి స్పందన కోసం ఎదురుచూస్తున్నారు.

భారత్-పాక్ మధ్య ఆపరేషన్ సిందూర్ వేళ తానే సంధి కుదిర్చినట్లు ట్రంప్ పదేపదే ప్రకటించుకొన్నారు. భారత్ మాత్రం దానిని వ్యతిరేకించింది. దీంతో ఇండో-పసిఫిక్ సహా పలు రంగాల్లో వ్యూహాత్మక భాగస్వామి అయిన భారత్‌ని దూరం చేసుకోవడానికి కూడా సిద్ధమయ్యారు. భారత్‌ను ఇబ్బంది పెట్టే చర్యలు తీసుకోవడం మొదలుపెట్టారు. దీంతో ఇరుదేశాల మధ్య గత సంబంధాలు దెబ్బతిని ఉద్రిక్త వాతావరణం నెలకొంది.

**నోబెల్ కమిటీ ఏమంది..?:** ట్రంప్ కార్యవర్గం శాంతి బహుమతి కోసం లాబీయింగ్‌ని వేగవంతం చేసింది. ఈనేపథ్యంలో నార్వేకు చెందిన నోబెల్ కమిటీ కార్యదర్శి క్రిస్టియన్ బెర్గ్ హర్ప్వికెన్ స్పందించారు. ప్రతి నామినీకి ప్రత్యేకమైన అర్హతలు ఉన్నాయి. మీడియా లేదా బహిరంగ ప్రచారాలు మా చర్చలపై ప్రభావం చూపవు అని చెప్పారు. ఏ అభ్యర్థి తరఫున మీడియాలో ప్రచారం జరుగుతోందో కూడా గమనిస్తామన్నారు. నార్వే పార్లమెంట్ నియమించిన ఐదుగురు సభ్యులు నామినేషన్లను పరిశీలిస్తారు. వీరు పూర్తి స్వతంత్రంగా వ్యవహరిస్తారు.

అక్టోబర్ 10వ తేదీన శాంతి బహుమతి ఎవరిని వరించిందో ప్రకటిస్తారు. ఈలోపే ట్రంప్‌లో ఒత్తిడి పెరిగిపోయి.. తనకు అది దక్కకపోతే అమెరికాకే అవమానం అంటూ కొత్త రాగం అందుకొన్నారు. తనలా గొప్ప పనులు చేయని ఎవరినో ఎంపిక చేసి వారికి దానిని ఇస్తారని నిరాశ వ్యక్తంచేశారు.

## పంటల నష్టాన్ని అంచనా వేయండి

(మొదటి పేజీ తరువాయి)

రైతులు తీసుకోవలసిన జాగ్రత్తలపై స్పష్టమైన సూచనలు అందించాలంటూ వ్యవసాయ శాఖ అధికారులకు దిశానిర్దేశం చేశారు. కాల్వలు, చెరువులకు గండ్లు పడకుండా ఎప్పటికప్పుడు పర్యవేక్షణ జరపాలని ఇరిగేషన్ అధికారులను ఆదేశించారు. ఏ పరిస్థితినైనా ఎదుర్కొనేందుకు రెవెన్యూ, విద్యుత్, పోలీస్, ఇరిగేషన్ శాఖలతో సమన్వయంగా చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. రైతులు నష్టపోకుండా ప్రతి ఒక్క అధికారి కట్టుదిట్టమైన పర్యవేక్షణతో పనిచేయాలని మంత్రి సూచించారు. ప్రభుత్వం రైతుల పక్కన నిలబడి ఉంది. వాయుగుండం, వర్షాల ప్రభావం ఎంతటి సవాళ్లను విసిరినా, అధికారులు క్షేత్రస్థాయిలో జాగ్రత్తలు తీసుకుని రైతులకు అండగా నిలవాలని మంత్రి పేర్కొన్నారు.

**భారీ వర్షాలు - వరద పరిస్థితులపై ఆరా**

ఒడిసా, ఉత్తరాంధ్ర, కోస్తా జిల్లాలలో కురుస్తున్న భారీ వర్షాలతో నాగావళి, వంశధార నదులు ఉప్పొంగుతున్న నేపథ్యంలో మంత్రి అచ్చెన్నాయుడు శ్రీకాకుళం, విజయనగరం, మన్యం జిల్లాల కలెక్టర్లు, ఎస్పీలతో ఫోన్ ద్వారా ప్రస్తుత పరిస్థితిని తెలుసుకున్నారు. ప్రజలకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా చర్యలు తీసుకోవాలని, ప్రాణనష్టం జరగకుండా ముందస్తు జాగ్రత్తలు పాటించాలని మంత్రి అచ్చెన్న అధికారులను ఆదేశించారు. జిల్లాల్లో కంట్రోల్ రూములు 24/7 ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. వరద సహాయక చర్యల్లో NDRF, SDRF, పోలీసు, ఫైర్ సిబ్బంది సమర్థంగా, వేగంగా స్పందించాలని మంత్రి స్పష్టం చేశారు. వంశధార, నాగావళి నదుల తీర ప్రాంతాల్లో నివసిస్తున్న ప్రజలకు ఎప్పటికప్పుడు హెచ్చరిక సందేశాలు పంపాలని అధికారులను ఆదేశించారు. టోల్ ఫ్రీ నెంబర్లు 112, 1070, 1800 425 0101 ద్వారా సమాచారం పొందవచ్చని మంత్రి తెలిపారు.

## అంబేద్కర్‌కు అవమానం చేసిన వారిపై కఠిన చర్యలు

**అమరావతి ( జర్నలిస్ట్ ఫైల్ ):** రాజ్యాంగ నిర్మాత డా. బి. ఆర్ అంబేద్కర్ కి అవమానం చేసిన వారిపై కఠిన చర్యలు తప్పవని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డా. డోలా బాల వీరాంజనేయస్వామి హెచ్చరించారు. చిత్తూరు జిల్లా వెదురుకుప్పంలో అంబేద్కర్ విగ్రహానికి మంటలు అంటుకున్న ఘటనను మంత్రి స్వామి తీవ్రంగా ఖండించారు. ఈ సందర్భంగా శుక్రవారం నాడు వెలగపూడి సచివాలయంలో మీడియాతో ఆయన మాట్లాడుతూ...... ఈ ఘటన జరగడం దురదృష్టకరం, జిల్లా ఎస్పీ, కలెక్టర్ ఇప్పటికే సంఘటన స్థలానికి వెళ్లి విచారణ చేపట్టారు. దోషులు ఎవరైనా వదిలే ప్రసక్తే లేదు, రాజ్యాంగ నిర్మాత అంబేద్కర్ కి అవమానం చేసిన వారిపై కఠిన చర్యలు తప్పవు. ఈ రోజు సాయంత్రం లోపు కొత్త అంబేద్కర్ విగ్రహాన్ని ఏర్పాటు చేసేలా ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఈ విషయంపై విద్వేషాలు రెచ్చగొట్టేలా ఎవరూ మాట్లాడొద్దు. జాతీయ నేతల విగ్రహాలకు అవమానం కలిగించేలా వ్యవహరిస్తే సహించేది లేదని వారిపై చట్ట ప్రకారం కఠిన చర్యలు తప్పవని మంత్రి డా. డోలా బాల వీరాంజనేయస్వామి అన్నారు.

## రూ. 500 కోట్ల పెట్టుబడులు

(మొదటి పేజీ తరువాయి)

సంస్థ ప్రతినిధులు, సుమారు రూ. 500 కోట్ల పెట్టుబడులు పెట్టడానికి సిద్దంగా ఉన్నట్లు తెలిపారు. ఈ యూనిట్ ద్వారా 1000 మందికి పైగా ప్రత్యక్ష ఉద్యోగాలు సృష్టించబడ్డాయని పేర్కొన్నారు. బెంగళూరు కేంద్రంగా ఉన్న సంస్థ, ప్రస్తుతం ప్రపంచవ్యాప్తంగా 7 దేశాలకు ఉత్పత్తులు ఎగుమతి చేస్తోందని తెలిపారు. భవిష్యత్తులో 80 దేశాలకు విస్తరించాలనే లక్ష్యంతో ముందుకు సాగుతుందని వారు తెలిపారు.

యుద్ధ రంగంలో ఏఐ ఆధారిత టెక్నాలజీ వినియోగించి తక్కువ వ్యయంతో అధునాతన ఏరోస్పేస్ పరికరాలు, యంత్రాలు తయారీ చేయడంలో సంస్థకు అనుభవం ఉంది. జాతీయ భద్రత కోసం ఆధునిక సాంకేతికతను ఉపయోగించి రక్షణ పరికరాలు ఉత్పత్తి చేయనున్నట్లు తెలిపారు.

మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డి, ఆంధ్రప్రదేశ్ ను దేశంలో డిఫెన్స్ &ఏరోస్పేస్ హబ్గా అభివృద్ధి చేయడంలో ఈ పెట్టుబడులు కీలకంగా ఉంటాయని చెప్పారు. రాష్ట్రంలో కొత్త పెట్టుబడులు యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలను విస్తరిస్తాయని ఆయన అన్నారు.

## పేదలకు భారీ ఊరట

(మొదటి పేజీ తరువాయి)

రాష్ట్రంలో మొత్తం 123 పట్టణ స్థానిక సంస్థలు ఉన్నాయి. ప్రతి ఏటా 35 వేలకు పైగా ఇళ్లు, అపార్ట్‌మెంట్లు, ఇతర నిర్మాణాలకు అనుమతులు ఇస్తారు. వీటి ద్వారా ప్రభుత్వానికి రూ. 1,500 కోట్ల వరకు ఆదాయం వస్తుంది అంటున్నారు అధికారులు. మొత్తం అనుమతుల్లో 25-30% వరకు 50 చదరపు గజాల్లోపు ఇళ్లే ఉంటాయి. ఈ ఇళ్లను పేద, మధ్య తరగతి కుటుంబాలే నిర్మించుకుంటారు.

ఏపీ ప్రభుత్వం 50 చదరపు గజాల్లోపు ఇళ్ల నిర్మాణాలకు రూపాయికే అనుమతి ఇస్తుంది. ఈ ఇళ్లకు పనులు పూర్తయినట్లు ధ్రువీకరణ, ఆక్యుపెన్సీ సర్టిఫికెట్ అవసరం లేదు. పట్టణ ప్రణాళిక విభాగం వీటిని అడగదు.. ఈ నిర్మాణాలకు కేవలం రూపాయి ఫీజు మాత్రమే ఉంటుంది. అయితే షాపులు కడితే మామూలు ఫీజులు కట్టాలి. 60 గజాల స్థలాన్ని 50 గజాలకు తగ్గించి ఇల్లు కడితే రూపాయి ఫీజు వర్తించదు.. అలాంటి వారికి మామూలు ఫీజులే ఉంటాయి. ప్రభుత్వ స్థలాల్లో లేదా వివాదాస్పద స్థలాల్లో ఇళ్ల నిర్మాణాలకు అనుమతులు తీసుకున్నట్లు తనిఖీల్లో వెల్లడైతే, ఆ అనుమతులను రద్దు చేస్తారు. అలాగే వారిపై చట్టపరమైన కఠిన చర్యలు తీసుకుంటారు. ప్రజలు ఈ అవకాశాన్ని ఉపయోగించుకోవాలని ప్రభుత్వం సూచిస్తోంది. అంతేకాదు ప్రజలపై కూడా భారం తగ్గుతుంది.. ఇంటి నిర్మాణ అనుమతుల కోసం ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన అవసరం కూడా ఉండదు.

## అగస్త్యేశ్వర స్వామి ఆలయ చైర్మన్‌గా సతీష్ బాబు



**గుంటూరు(జర్నలిస్ట్ ఫైల్):** రాష్ట్రంలో దేవాలయాలకు మహర్దశ వచ్చిందని, కూటమి ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా తీసుకుని ఆలయాల అభివృద్ధికి నిధులు కేటాయిస్తోందని గుంటూరు తూర్పు ఎమ్మెల్యే నసీర్ అన్నారు. పాత గుంటూరులోని అగస్త్యేశ్వర స్వామి ఆలయ కమిటీ చైర్మన్ గా గాలి సతీష్ బాబుతోపాటు కమిటీ సభ్యులు శుక్రవారం ప్రమాణ స్వీకారం చేశారు. ముఖ్యఅతిథిగా హాజరైన ఎమ్మెల్యే నసీర్ నూతన కమిటీకి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నసీర్ మాట్లాడుతూ రాష్ట్రంలో దేవాలయాల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తోందని అన్నారు. టీడీపీ ఆధ్వర్యంలో రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో ఆలయాల నిర్మాణం చేపట్టిందని వెల్లడించారు. రాష్ట్రంలో 361 ఆలయాల నిర్మాణానికి రూ. 500 కోట్ల నిధులు మంజూరు చేసినట్లు తెలిపారు. ఎంతో పురాతన ప్రాశస్త్యం కలిగిన అగస్త్యేశ్వర స్వామి ఆలయ అభివృద్ధి నూతన కమిటీ ప్రత్యేక కార్యాచరణ చేపట్టాలని సూచించారు. భక్తులకు సదుపాయాలు కల్పించాలని, ఆలయం బయట వాతావరణం ఆహ్లాదకరంగా ఉండేలా చూసుకోవాలని చెప్పారు. అనంతరం అగస్త్యేశ్వర స్వామి ఆలయ చైర్మన్ గాలి సతీష్ బాబు మాట్లాడుతూ తనకు అవకాశం కల్పించిన ఎమ్మెల్యే నసీర్ గారికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. పురాతన చరిత్ర కలిగిన అగస్త్యేశ్వర స్వామి ఆలయ పవిత్రతను కాపాడతామని, భక్తులకు మెరుగైన సదుపాయాలు అందేలా చూస్తామని వెల్లడించారు. కార్యక్రమంలో ఈవో సౌమ్య, ఆలయ చైర్మన్ గాలి సతీష్ బాబు, సాధు రామకృష్ణ, వరలక్ష్మి, సునీత, పద్మావతి, మల్లిక, జయలక్ష్మి, లలిత, కాంతారావు, శివ నాగరాజు నాయక్, కొలగాని సతీష్ తదితరులు పాల్గొన్నారు.

## అమరావతిలో పెట్టుబడులు



(మొదటి పేజీ తరువాయి)

**ప్రపంచంలో టాప్ 5 రాజధానుల్లో ఒకటిగా అమరావతి...మంత్రి నారాయణ**

అమరావతిలో జరుగుతున్న అభివృద్ధి పనులను మంత్రి నారాయణ మలేషియా ప్రతినిధులకు వివరించారు..ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నాయకత్వంలో ప్రణాళికా బద్ధంగా అమరావతి నిర్మాణం చేస్తున్నట్లు తెలిపారు...ఇప్పటికే 51 వేల కోట్ల విలువైన పనులకు టెండర్లు పూర్తయి,పనులు కూడా ప్రారంభమయ్యాయని,నిర్ధేశిత గడువులతో నిర్మాణ పనులు పూర్తి చేస్తున్నామన్నారు..కేపిటల్ సిటీలో 360 కిమీ మేర ట్రంక్ రోడ్లు ఏడాదిన్నరోగా, 1500 కిమీ మేర లే అవుట్ రోడ్లు రెండేళ్లలోగా, అధికారులు, ఉద్యోగులు,ప్రజాప్రతినిధులకు చెందిన 4000 ఇళ్లను వచ్చే మార్చి నెలాఖరులోగా పూర్తి చేయాలనే టార్గెట్ పెట్టుకున్నామన్నారు మంత్రి. అలాగే పాలనా భవనాలైన సచివాలయం టవర్లు,అసెంబ్లీతో పాటు హైకోర్టు భవనాలను రెండున్నరేళ్లలో పూర్తి చేసేలా టార్గెట్ పెట్టుకుని ముందుకెళు తున్నామన్నారు.గత మూడు నెలలుగా వర్షాల వల్ల పనులకు కొంతమేర ఆటంకం కలిగిందని....రాబోయే రోజుల్లో పనులు వేగవంతం అవుతాయని మంత్రి నారాయణ మలేషియా బృందానికి వివరించారు.

ఈ సమావేశంలో మున్సిపల్ శాఖ ముఖ్య కార్యదర్శి సురేష్ కుమార్,సీఆర్డీఏ కమిషనర్ కన్నబాబు,సీఆర్డీఏ అదనపు కమిషనర్ భార్గవ తేజ పాల్గొన్నారు.

## రూ.4 లక్షల ఎక్స్ గ్రేషియా



(మొదటి పేజీ తరువాయి)

పార్వతీపురం మన్యం జిల్లాలోని కురుపాంలో ఒకరు మృతి చెందినట్టు అధికారులు తెలిపారు. దీనిపై స్పందించిన సీఎం మృతుల కుటుంబాలకు రూ. 4 లక్షల చొప్పున పరిహారం ఇవ్వాలని అధికారులను ఆదేశించారు. ఉత్తరాంధ్ర జిల్లాల్లో ప్రస్తుతానికి వర్షం లేదని... అయినా ఎగువ నుంచి వస్తున్న ప్రవాహాలతో ఆయా నదుల్లో వరద ఉందని అధికారులు సీఎంకు వివరించారు. వర్షాలు, వరదల కారణంగా దెబ్బతిన్న రహదారులు, విద్యుత్తును వెంటనే పునరుద్ధరించాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. విద్యుత్ సరఫరా పునరుద్ధరణలో ఎక్కడా జాప్యం లేకుండా చూడాలని సీఎం సూచించారు. వరద కారణంగా నీట మునిగిన పంటను కూడా లెక్కించి పంట నష్టం అంచనాలను తయారు చేయాలన్నారు. అదే సమయంలో వంషపు నీటిని సద్వినియోగం చేసుకునేందుకు గానూ రిజర్వాయర్లను నీటితో నింపాలని సూచించారు. ప్రజల ఇబ్బందులను మానవీయ కోణంలో పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని సీఎం సూచించారు.

## ఆటో డ్రైవర్ సేవలో...

(మొదటి పేజీ తరువాయి)

ప్రయాణం సాగేలా చేసింది. అంతేకాకుండా పాతవాహనాలపై గత ప్రభుత్వం భారీగా వేసిన గ్రీన్ ట్యాక్స్‌ను కుదించింది. నాడు రూ. 20 వేలు ఉన్న గ్రీన్ ట్యాక్స్ ను రూ. 3 వేలకు తగ్గించి వాహనదారులకు పెద్దమొత్తంలో ఉపశమనం కలిగించింది. దీంతో ఆటోలు, క్యాబ్ లపై పెద్ద ఎత్తున భారం తొలగింది.

**ఫిర్యాదుల కోసం ప్రత్యేక వ్యవస్థ :** అర్హులైన ప్రతి లబ్ధిదారుడికి పథకం అందేలా చేయాలని అధికారులకు ప్రభుత్వం నుంచి స్పష్టమైన ఆదేశాలు వెళ్లాయి. అర్హత ఉండి కూడా జాబితాలో పేరు లేకుంటే... వారి సమస్యను పరిష్కరించిన వెంటనే లబ్ధిదారుల జాబితాలో చేర్చేందుకు ఏర్పాట్లు చేశారు. దీని కోసం ప్రత్యేకంగా ఫిర్యాదులు స్వీకరించేందుకు ప్రభుత్వం ఓ వ్యవస్థను ఏర్పాటు చేసింది. వాట్సాప్ ద్వారా ఒక ప్రత్యేక గ్రీవెన్స్ హ్యాండ్లింగ్ సిస్టమ్‌ను కూడా అందుబాటులోకి తెచ్చింది. లబ్ధిదారులు తప్పనిసరిగా ఆంధ్రప్రదేశ్‌లో చెల్లుబాటు అయ్యే డ్రైవింగ్ లైసెన్స్, రిజిస్ట్రేషన్ కలిగి ఉండాలని ప్రభుత్వం స్పష్టం చేసింది.

## పోలవరం పనుల్లో రాజీ వద్దు

(మొదటి పేజీ తరువాయి)

అలాగే పనుల్లో నాణ్యత విషయంలో ఎలాంటి రాజీ వద్దని ముఖ్యమంత్రి అధికారులకు సూచనలు జారీ చేశారు. డయాఫ్రం వాల్ మొత్తం 63,656 క్యూబిక్ మీటర్లకు గానూ 37,302 క్యూబిక్ మీటర్ల మేర పనులు పూర్తి అయ్యాయని అధికారులు వివరించారు. బట్రస్ డ్యామ్ పనులు వందశాతం పూర్తి అయినట్టు తెలిపారు. వైబ్రో కాంపాక్షన్ పనులు కూడా 74 శాతం మేర పూర్తైనట్టు సీఎంకు తెలియచేశారు. ఈ ఏడాది డిసెంబరు నాటికి డయాఫ్రం వాల్ పనులు పూర్తి కావాలని సీఎం స్పష్టం చేశారు. ప్రాజెక్టులో ప్రధాన డ్యామ్ ఎర్త్ కమ్ రాక్ ఫిల్ డ్యామ్ పనుల్ని నవంబరు 1 నుంచే ప్రారంభించాలని.. 2027 డిసెంబరుకు పూర్తి చేయాలని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. పోలవరం కుడి కాలువను అనుసంధానించే సొరంగాల నిర్మాణం, ఎడమ కాలువకు అనుసంధానం చేసేలా అప్రోచ్ ఛానల్, హెడ్ రెగ్యులేటర్, ఇరిగేషన్ టన్నెల్, కేఎల్ బండ్ లను త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు. ప్రధాన ఎడమ కాలువను 2026 జనవరి నాటికల్లా అనకాపల్లి వరకూ పూర్తి చేయాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. ప్రాజెక్టుకు అవసరమైన భూసేకరణ, నిర్వాసితులకు పరిహార, పునరావాసాన్ని నిర్దేశిత గడువు లోగా పూర్తి చేయాలని అధికారులకు సూచనలు జారీ చేశారు.

**పోలవరం వద్ద పర్యాటక ఆకర్షణలు**

దేశంలోనే అత్యుత్తమ ప్రాజెక్టుగా నిర్మిస్తున్న పోలవరం వద్ద పర్యాటకులను ఆకర్షించేలా నిర్మాణాలు ఉండాలని ముఖ్యమంత్రి సూచించారు. ప్రాజెక్టు నుంచి భద్రాచలం, పాపికొండలు, దిగువన ధవళేశ్వరం వరకూ వివిధ ప్రాంతాలను అద్భుతంగా తీర్చిదిద్దాలన్నారు. పోలవరం ప్రాజెక్టు కనెక్టివిటీ కింద ఐకానిక్ రోడ్డు నిర్మించాలని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. దీనిని జాతీయ రహదారికి అనుసంధానించేలా చూడాలన్నారు. రాజమహేంద్రవరం కేంద్రంగా పర్యాటకాన్ని అభివృద్ధి చేసేలా అఖండ గోదావరి ప్రాజెక్టును చేపట్టాలన్నారు. పోలవరం ప్రాజెక్టులో పనుల పురోగతిని ఎప్పటికప్పుడు తెలుసుకునేలా సీసీ కెమెరాలను ఏర్పాటు చేసి ఆర్టీజీఎస్‌కు అనుసంధానించాలని సూచించారు. వచ్చే వర్షాకాల సీజన్‌లోగా వెలిగొండ ప్రాజెక్టు పూర్తి చేయాలని సీఎం ఆదేశించారు. ఈ సమీక్షకు సీఎస్ కే.విజయానంద్, జలవనరుల శాఖామంత్రి నిమ్మల రామానాయుడు, ఉన్నతాధికారులు హాజరయ్యారు.

## అమీన్ పీర్ దర్గా ఉరుసుకు ఆహ్వానం



**అమరావతి ( జర్నలిస్ట్ ఫైల్ ):** కడప అమీన్ పీర్ దర్గా( పెద్ద దర్గా) ఉరుసు మహోత్సవానికి ముఖ్య అతిథిగా హాజరుకావాలని హాజరుకావాలని కోరుతూ రాష్ట్ర న్యాయ, మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండి ఫరూక్ ను దర్గా ప్రతినిధులు ఆహ్వానించారు. శుక్రవారం అమరావతిలోని క్యాంపు కార్యాలయంలో అమీన్ పీర్ దర్గా ప్రతినిధుల బృందం మంత్రి ఫరూక్ ను కలిశారు. నవంబర్ 5 వ తేదీ నుండి 9 వ తేదీ వరకు ఐదు రోజులపాటు ఉరుసు మహోత్సవాన్ని అత్యంత వైభవంగా నిర్వహించేందుకు కార్యాచరణ రూపొందించినట్లు మంత్రి ఫరూక్ కు ప్రతినిధుల బృంద సభ్యులు వివరించారు. ఉరుసు మహోత్సవానికి వివిధ రాష్ట్రాల నుంచి కూడా భక్తులు పెద్ద ఎత్తున తరలి వస్తారని , అందుకు తగినట్లుగా ఉరుసు మహోత్సవాన్ని వైభవంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశామని తెలిపారు. అమీన్ పీర్ దర్గా మహోత్సవానికి హాజరు కావాలని కోరుతూ మైనారిటీ మంత్రి ఎన్ఎండి ఫరూక్ కు దర్గా ప్రతినిధుల బృంద సభ్యులు ఆహ్వాన పత్రికను అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి ఫరూక్ దర్గా ప్రతినిధుల బృందంతో మాట్లాడుతూ కడపలో జరిగే అమీన్ పీర్ దర్గా ఉరుసు మహోత్సవానికి తప్పక హాజరవుతానని హామీ ఇచ్చారు.

## అహింసా ఆయుధమే ఆదర్శం



**గుంటూరు(జర్నలిస్ట్ ఫైల్):** అహింసా ఆయుధంతో భారతదేశ బానిస సంకెళ్లు తెంచిన మహనీయులు గాంధీజీ అని గుంటూరు తూర్పు ఎమ్మెల్యే నసీర్ అన్నారు. గురువారం గాంధీ జయంతి, లాల్ బహదూర్ శాస్త్రి జయంతిని పురస్కరించుకుని స్థానిక తూర్పు శాసనసభ్యుల వారి కార్యాలయం, హిమని సెంటర్ లోని గాంధీజీ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నసీర్ మాట్లాడుతూ గాంధీ మహాత్ముడు నా జీవితమే నా సందేశం అని చెప్పడం ద్వారా వ్యక్తిగతంగా ప్రతి ఒక్కరూ తమకు తాము తెలుసుకోవాలని బోధించారన్నారు. ఉప్పు సత్యాగ్రహం చేపట్టి భారతీయుల్లో స్వాతంత్ర్య స్ఫూర్తి తీసుకొచ్చారని పేర్కొన్నారు. స్వచ్ఛత, గ్రామ స్వరాజ్యం గాంధీజీకి రెండు కళ్లులాంటివని తెలిపారు. స్వచ్ఛత హి సేవ ద్వారా కూటమి ప్రభుత్వం గాంధీ మార్గంలో పని చేస్తోందని అన్నారు. సీఎం చంద్రబాబు విజనరీతో స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర కార్యక్రమానికి శ్రీకారం చుట్టారని తెలిపారు. యువతే దేశానికి నిజమైన సంపద అనే విషయాన్ని గాంధీజీ సందేశమిచ్చారని, దీనిని కూటమి ప్రభుత్వం ఆచరణలో పెడుతోందని స్పష్టం చేశారు. స్వాతంత్ర్య సాధనలో లాల్ బహదూర్ శాస్త్రి పోరాటం మరువలేమన్నారు.

## జి.ఎస్.టి డేటా అప్ లోడ్ చేయాలి

**ఉమ్మడి గుంటూరు జిల్లా బ్యూరో (జర్నలిస్ట్ ఫైల్) :** సూపర్ జిఎస్టి – సూపర్ సేవింగ్స్ కార్యక్రమం వివరాలను సక్రమంగా అప్ లోడ్ చేయాలని జాయింట్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాస్తవ సంబంధిత అధికారులను ఆదేశించారు. సూపర్ జిఎస్టి – సూపర్ సేవింగ్స్ కార్యక్రమంపై శుక్రవారం సంబంధిత అధికారులతో టెలి కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో కార్యక్రమాలను పెద్ద ఎత్తున చేపట్టడం జరుగుతోందని, అయితే వాటిని సంబంధిత పోర్టల్ లో సక్రమంగా అప్ లోడ్ చేయడం లేదని అన్నారు. ప్రతి శాఖ తమకు నిర్దేశించిన కార్యక్రాలను ఆయా తేదీల్లో పకడ్బందీగా చేపట్టి, కార్యక్రమం పూర్తి చేసిన రెండు గంటల్లో అప్ లోడ్ చేయాలని ఆదేశించారు. శాఖల వారీగా కలిగే ప్రయోజనాలను ప్రజలకు అవగాహన కల్పించాలని, వాటి పోస్టర్లు ప్రదర్శించాలని, కరపత్రాలు పంపిణీ చేయాలని అన్నారు. సూపర్ జిఎస్టి – సూపర్ సేవింగ్స్ కార్యక్రమంను ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిందని పేర్కొన్నారు. ప్రజల్లో విస్తృతంగా ప్రచారం చేపట్టి వాటి ప్రయోజనం పొందే విధంగా చేయాల్సిన బాధ్యత అధికారులపై ఉందని స్పష్టం చేశారు. కార్యక్రమాల ఫొటోలు, వీడియోలు అప్ లోడ్ చేయడం, ఫ్లెక్సీలు ప్రదర్శించడం చేయాలని చెప్పారు. ఈ టెలి కాన్ఫరెన్స్ లో జిల్లా రెవిన్యూ అధికారి ఎన్.ఎస్.కె. ఖాజా వలి, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## నరసరావుపేట ప్రభుత్వ ఏరియా వైద్యాశాలకు వితరణ



**ఉమ్మడి గుంటూరు జిల్లా బ్యూరో (జర్నలిస్ట్ ఫైల్) :** ఆంధ్రప్రదేశ్ బులియన్ మర్చెంట్స్ రాష్ట్ర అధ్యక్షుడు కపిలవాయి విజయ్ కుమార్ నరసరావు పేటలోని ప్రభుత్వ ఏరియా వైద్యాశాల అభివృద్ధికి దోహదపడేలా 1 లక్ష ఓపీ (ఔట్ పేషెంట్) స్లిప్పులను (ప్రింట్ చేసిన బండిల్స్) వితరణ చేశారు. ఈ వితరణ ను ప్రభుత్వ ఏరియా హాస్పిటల్ అభివృద్ధి కమిటీ చైర్మన్ డాక్టర్ లక్కిరెడ్డి వెంకటేశ్వర రెడ్డి, హాస్పిటల్ సూపరింటెండెంట్ డాక్టర్ సురేష్ కుమార్, ఆర్ ఎంఓ డాక్టర్ ఏడుకొండలు అందుకున్నారు. ఈ దానం ఆసుపత్రి సేవలను మరింత సమర్థవంతం చేయడానికి, రోగులకు వేగవంతమైన రిజిస్ట్రేషన్ సౌలభ్యం కల్పించడానికి ఉపయోగపడుతుందని అధికారులు తెలిపారు. కపిలవాయి విజయ్ కుమార్ మాట్లాడుతూ "సమాజ సేవ మా మొదటి బాధ్యత. ఆసుపత్రి సిబ్బందికి కొంచెం సహాయం చేయాలని భావించాం. భవిష్యత్తులో కూడా ఇలాంటి కార్యక్రమాలు చేపడతాం" అని పేర్కొన్నారు. కపిలవాయి విజయ్ కుమార్ గతంలో అనేక సేవా కార్యక్రమాలు నిర్వహించారు. వైశ్య సముదాయానికి చెందిన పేద మెరిట్ విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు అందించడం, విద్యా సహాయం కల్పించడం వంటి కార్యక్రమాల ద్వారా సమాజంలో మంచి పేరు తెచ్చుకున్నారు. ఈ దానం ఆసుపత్రి అభివృద్ధికి మరో మైలురాయి అవుతుందని, ఇలాంటి స్వచ్ఛంద సేవలు స్థానిక సమాజానికి మార్గదర్శకంగా ఉంటాయని డాక్టర్ లక్కిరెడ్డి వెంకటేశ్వర రెడ్డి అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమంలో బులియన్ మర్చెంట్స్ కమిటీ సభ్యులు, స్థానిక నాయకులు, ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు. ఈ దానం ద్వారా రోగుల సేవలో మరింత సౌలభ్యం కల్పించబడుతుందని, స్వచ్ఛంద సంస్థలు-వ్యాపారుల సహకారం ఆసుపత్రి అభివృద్ధికి కీలకమని అధికారులు చెప్పారు.

# మీరే .. వారదులు

### యంగ్ ప్రొఫెషనల్స్‌ను ఉద్దేశించి మాట్లాడిన కలెక్టర్

### నియోజకవర్గ ప్రత్యేక అధికారులతో సమావేశం



**ఉమ్మడి గుంటూరు జిల్లా బ్యూరో (జర్నలిస్టు ఫైల్) :** మీరే వారదులు అని నియోజక వర్గం స్థాయిలో పనిచేస్తున్న "యంగ్ ప్రొఫెషనల్స్" ను ఉద్దేశించి జిల్లా కలెక్టర్ ఏ తమీమ్ అన్సారియా అన్నారు. శుక్రవారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో నియోజక వర్గ ప్రత్యేక అధికారులు, యంగ్ ప్రొఫెషనల్స్ తో సమావేశం జరిగింది. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ నియోజకవర్గాన్ని ప్రగతి పథంలో నడిపించడంలో యంగ్ ప్రొఫెషనల్స్ కీలక పాత్ర వహించాలన్నారు. "ఉన్నత విద్యార్హత కలిగి యంగ్ ప్రొఫెషనల్స్ గా చేరారని, మీ విజ్ఞానం వృథా కాకుండా సమాజ హితానికి దోహదం కావాలని" పిలుపునిచ్చారు. దేశంలో ఎక్కడా లేని విధంగా రాష్ట్రంలో నియోజక వర్గ స్థాయిలో కార్యాలయాలను ముఖ్య మంత్రి ఏర్పాటు చేశారన్నారు. ఈ వ్యవస్థను విజయవంతం చేయడంలో ధృడ సంకల్పంతో పని చేయాలని కోరారు. నియోజక వర్గాల స్థాయిలో విజన్ యాక్షన్ ప్లాన్ తయారు చేయడం జరిగిందని దానిపట్ల క్షుణ్ణంగా అవగాహన పొందాలని సూచించారు. నియోజక వర్గంలో క్షేత్ర స్థాయిలో ప్రతి అంశం పట్ల సంపూర్ణ అవగాహన అవసరం అన్నారు. మీడియాలో వస్తున్న సానుకూల, వ్యతిరేక వార్తలను కూడా పరిశీలించి వివరాలు తెలుసుకోవాలని తద్వారా అవగాహన పెంపొందుతుందని చెప్పారు. నియోజక వర్గంలో అభివృద్ధికి అవకాశం ఉన్న రంగాలను గుర్తించాలని, వాటి పురోగతికి అవసరమగు కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలని అన్నారు. ప్రాథమిక, సెకండరీ, సేవా రంగాల్లో ఉన్న అన్ని అవకాశాలు ఉపయోగించుకొని నియోజకవర్గం అభివృద్ధిలో ప్రముఖ పాత్ర పోషించాలన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రధాన కార్యక్రమాలు (ఫ్లాగ్ షిప్ ప్రోగ్రామ్ లు) – ఎన్.టి.ఆర్ భరోసా పింఛన్ల పంపిణీ, ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పి.జి.ఆర్.ఎస్) తదితర అంశాల
అమలులో భాగస్వామ్యం కావాలని ఆదేశించారు. ఆ ప్రాంతాల్లో చేపడుతున్న ప్రాజెక్టులు, ఇతర అంశాల పట్ల స్పష్టమైన అవగాహన పొంది సూచనలు అందించే స్థాయిలో ఉండాలని ప్రేరణ కల్పించారు. నియోజక వర్గాల ప్రత్యేక అధికారులు, శాసన సభ్యులుతో చక్కటి సమన్వయం చేసుకోవాలని తద్వారా ప్రతి అంశానికి మంచి విశ్లేషణ చేయవచ్చని పేర్కొన్నారు. ప్రభుత్వం ఇస్తున్న అభివృద్ధి సూచికలు, లక్ష్యాల సాధనలో దృష్టి సారించాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వహణ అధికారి జ్యోతి బసు, వ్యవసాయ శాఖ జాయింట్ డైరెక్టర్ అయితా నాగేశ్వర రావు, గుంటూరు నగర పాలక సంస్థ అదనపు కమిషనర్ చల్లా ఓబులేసు తదితరులు పాల్గొన్నారు.

## ఖరీఫ్ సీజన్ లో 50 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరణ




**ఉమ్మడి గుంటూరు జిల్లా బ్యూరో (జర్నలిస్టు ఫైల్)** 2025-26 ఖరీఫ్ సీజన్ లో 50 వేల మెట్రిక్ టన్నుల సేకరణకు లక్ష్యంగా పెట్టుకున్నట్లు జిల్లా సంయుక్త కలెక్టర్ అశుతోష్ శ్రీవాస్తవ పేర్కొన్నారు. శుక్రవారం కలక్టరేట్ లోని డీఆర్సీ మీటింగ్ హాల్ లో జిల్లా సంయుక్త కలెక్టర్ అశుతోష్ శ్రీవాస్తవ అధ్యక్షత జరిగిన జిల్లా ధాన్య సేకరణ కమిటీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా సంయుక్త కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో 3,89,849 మెట్రిక్ టన్నుల ధాన్యం ఉత్పత్తి అంచనా వుందని , ఇందులో డిసెంబర్ 2025 నుండి 50 వేల మెట్రిక్ టన్నులు ధాన్యం కొనుగోలు చేయుటకు ఏర్పాటు జరుగుతుందన్నారు. 177 రైతు సేవా కేంద్రాలు , 45 రైతు సేవా క్లస్టర్ల ద్వారా ధాన్యం సేకరించడం జరుగుతుందన్నారు. ఏ గ్రేడ్ ధాన్యం క్వింటాకు రూ. 2,389/- లు , సాధారణ రకానికి రూ. 2,369/- లకు కొనుగోలు చేయడం జరుగుతుందన్నారు. వ్యవసాయ అధికారులు ఇ - పంట , ఇ - కేవైసీ వంద శాతం పూర్తి చేయాలని సంయుక్త కలెక్టర్ ఆదేశించారు. వ్యవసాయ అధికారులు పండించిన పంట రకాన్ని గుర్తించాలని , తేమ శాతం అధికంగా వుండకుండా చూడాలని చెప్పారు. ధాన్యం సేకరణ నిబంధనలను రైతులకు తెలియజేయాలన్నారు. రైతులు తమ పంటను ఏ మిల్లులకు అందించాలనుకుంటున్నారో తెలుసుకుని ఆ మిల్లులకు పంటను తరలించేలా సివిల్ సప్లయ్ అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. ధాన్యం తరలించే వాహనాలకు జీపీఎస్ వుండేలా రవాణా శాఖాధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. తేమ శాతం అధికంగా వుంటే డ్రైయర్లను వుపయోగించుకోవాలన్నారు. రైతులకు అవసరమైన టార్పాలిన్ లు సరఫరా చేసేందుకు మార్కెటింగ్ శాఖాధికారులు అలాగే ధాన్యం తుకానికి సంబంధించి లీగల్ మెట్రాలజీ అధికారులు పకడ్బంధీ చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. ధ్యానం లోడింగ్ , ఆన్ లోడింగ్ చేసేందుకు సరిపడా హమాలీలను సిద్దం చేసుకోవాలని కార్మిక శాఖ అధికారులకు సూచించారు. మిల్లర్లు మాట్లాడుతూ టార్పాలిన్ లు సబ్సిడీపై అందించాలని , పెండింగ్ బిల్లులు చెల్లించాలని కోరగా , ఈ విషయమై ప్రభుత్వానికి తెలియజేసి తదుపరి చర్యలు తీసుకుంటామని సంయుక్త కలెక్టర్ తెలిపారు. సమావేశంలో జనరల్ మేనేజర్ సివిల్ సప్లయ్ పి. జయంతి , పౌర సరఫరాలు , వ్యవసాయ , రవాణా , మార్కెటింగ్ శాఖల అధికారులు , జీడీసిఏంఎస్ బ్రాంచ్ మేనేజర్, మిల్లర్లు పాల్గొన్నారు.

## నల్లపాడు పోలీస్ స్టేషన్‌లో ఎస్పీ వకుల్ జిందాల్ ఆకస్మిక తనిఖీ



**గుంటూరు(జర్నలిస్ట్ ఫైల్):** గుంటూరు జిల్లా సౌత్ పోలీస్ సబ్ డివిజన్ పరిధిలోని నల్లపాడు పోలీస్ స్టేషన్‌లో శుక్రవారం జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. తనిఖీ సందర్భంగా పోలీసులు చేస్తున్న కార్యకలాపాలను సమగ్రంగా సమీక్షించారు. పోలీస్ స్టేషన్ పరిధి భౌగోళిక మ్యాప్, ప్రాంతాల వారీ కేసుల నమోదు వివరాలు, శాంతి భద్రతలకు సంబంధించిన అంశాలను పరిశీలించారు.
స్టేషన్ పరిసరాల పరిశుభ్రతపై శ్రద్ధ వహించి, స్వీయ పారిశుధ్య చర్యలు చేపట్టాలని సూచించారు. అలాగే రికార్డుల నిర్వహణ, నవీకరణపై సిబ్బందితో చర్చించి, కేసుల పురోగతిని వేగవంతం చేయాలని సూచించారు.
రిసెప్షన్ సిబ్బందితో మాట్లాడి ప్రజల పట్ల పోలీసులు ప్రవర్తించే తీరు, ఫిర్యాదుల స్వీకరణ విధానం, వాటిని అధికారి దృష్టికి తీసుకెళ్ళడంలో పారదర్శకతను పరిశీలించారు.
పరిధిలో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాల పనితీరును పరిశీలించి, అవి సక్రమంగా పనిచేయడానికి పర్యవేక్షణ చేయాలని ఆదేశించారు. కేసుల్లో సీజ్ చేసిన వాహనాల విడుదల ప్రక్రియను చట్టపరంగా, పారదర్శకంగా నిర్వహించమని సూచించారు.
తనిఖీ కార్యక్రమంలో సిబ్బందితో విధుల్లో జాగ్రత్త, క్రమశిక్షణ, పారదర్శకతతో వ్యవహరించి, ప్రజలకు భరోసా కల్పించేందుకూ, సమస్యలకు సకాలంలో పరిష్కారం చూపించేందుకూ సూచనలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సౌత్ డీఎస్పీ భానోదయ, ఎస్బి సీఐ అలహరి. శ్రీనివాస్, నల్లపాడు సీఐ వంశీధర్, ఎస్సైలు మరియు పోలీసులు పాల్గొన్నారు.

## జిల్లా కలెక్టర్‌ను కలిసిన బీజేపీ జిల్లా అధ్యక్షులు



**గుంటూరు (జర్నలిస్ట్ ఫైల్) :** జిల్లా కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన ఏ. తమీమ్ అన్సారియాను బీజేపీ జిల్లా అధ్యక్షులు చెరుకూరి తిరుపతిరావు మర్యాదపూర్వకంగా కలిశారు. కలెక్టర్‌కు పుష్పగుచ్చం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.
ఈ సందర్భంగా జిల్లా అభివృద్ధి, ప్రజా సమస్యల పరిష్కారం పై చర్చలు జరిగాయి. ప్రజా పిర్యాదుల విభాగాన్ని బలోపేతం చేసి ప్రజలకు మరింత సులభతరం చేయాలని నేతలు సూచించారు. గుంటూరు నగరంలోని శంకర్ విలాస్ వంతెన పనులు ఎక్కువకాలంగా నిలిచిపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, వాటిని త్వరగా పూర్తి చేయాలని కలెక్టర్‌ను కోరారు. ఈ సమావేశంలో బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి భజరంగ్ రామకృష్ణ, వై.వి. సుబ్బారావు, చరకా కుమార్ గౌడ్ పాల్గొన్నారు.

## దసరా మహోత్సవాలు



**బ్రహ్మంగారిమఠం (కడప జిల్లా) జర్నలిస్ట్ ఫైల్ :** బ్రహ్మంగారిమఠం మండలంలోని స్థానిక వాసవి కన్యకా పరమేశ్వరి ఆలయం నందు 12 రోజులపాటు దసరా మహోత్సవాలు నూతన అధ్యక్షులు అయ్యప్ప వెంకట సురేష్ బాబు కార్యదర్శి సుంకు సురేష్ కోశాధికారి దుగ్గిశెట్టి వెంకటేశ్వర్లు మాజీ అధ్యక్షులు బన్నూరు కృష్ణమూర్తి మరియు మాజీ కమిటీ సభ్యులు నేతృత్వంలో రంగ రంగ వైభవంగా నిర్వహించడం జరిగిందని అయ్యపు సురేష్ ప్రకటనలో పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో గురువారం నాడు శమీ దర్శనానికి బయలుదేరి దిగ్విజయంగా అమ్మవారి శమీ దర్శనం జరిగింది ఇందులో దేవి శరన్నవరాత్రుల మహోత్సవంలో లడ్డును అమ్మవారి దగ్గర ఉంచి ఆ లడ్డును వేలంపాటలో అయ్యప్ప సురేష్ 51 వేలకు దక్కించుకున్నారు శమీ దర్శనం అనంతరం శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారు తొట్టి నెరవనితో గ్రామ పురవీధుల్లో వెళ్లి భక్తులకు స్థానిక పుర ప్రజలకు దర్శనమిచ్చారు. అనంతరం శుక్రవారం వసంతోత్సవము కార్యక్రమం నిర్వహించి అదే రోజు రాత్రికి అమ్మవారికి పాన్పు సేవ కార్యక్రమంతో దసరా ఉత్సవాలు ముగింపు పలుకుతూ ఉత్సవాలు విజయవంతంగా జరిగాయని కొనియాడారు

## జాతీయరంగస్థల పురస్కారం ప్రదానం



**తెనాలి (జర్నలిస్ట్ ఫైల్)** దసరా మహోత్సవాలతో పాటుగా,కళల కాణాచి సంస్థ ఏర్పాటు చేసిన జాతీయ స్థాయి వీణ అవార్డ్స్ నాటకోత్సవాలు గురువారం రాత్రితో ఘనంగా ముగిశాయి
స్థానిక కొత్తపేటలోని రామకృష్ణ కవి కళాక్షేత్రం వేదికగా నిర్వహించిన జాతీయ స్థాయి వీణ అవార్డ్స్ నాటకోత్సవాలు ముగింపు సందర్భంగా, ప్రారంభసభలో బుర్ర సుబ్రహ్మణ్య శాస్త్రి జాతీయ రంగస్థలం పురస్కారాన్ని, సీనియర్ పౌరాణిక రంగస్థలం నటులు ఉప్పలపాడు సైదులుకు ప్రధానం చేశారు. ప్రముఖ నాటక విశ్లేషకులు కందిమళ్ళ సాంబశివరావు అధ్యక్షత వహించిన సభలో, అజో, విభో కందాళం పరిషత్తు నిర్వాహకులు అప్పా జోస్యుల సత్యనారాయణ, ఆర్. శ్రీకాంత్ రెడ్డి, మాజీ మహిళా కమిషన్ చైర్మన్ నన్నపనేని రాజకుమారి, తుమ్మల కిషోర్ తదితర ప్రముఖులు, అతిథులుగా పాల్గొని, తమ ప్రసంగాల్లో, నాటక కళా రంగానికి, కళల కాణాచి సంస్థ చేస్తున్న సేవలను ప్రశంసించారు. డాక్టర్ సాయి మాధవ్ బుర్ర, మాట్లాడుతూ పరిషత్తు నిర్వహించడం ఒక యజ్ఞంతో సమానమని అన్నారు. అప్పాజోస్యుల సత్యనారాయణ మాట్లాడుతూ పౌరాణిక పద్య నాటకాలతో పరిషత్ నిర్వహించడం సామాన్య విషయం కాదన్నారు, వీణ అవార్డ్స్ నాటక ఉత్సవాలు ద్వారా, పౌరాణిక పద్య నాటకాన్ని, సరికొత్త పందాలో ముందుకు తీసుకు వెళు తున్నారని, కళా పరిషత్ నిర్వాహకులను ప్రశంసించారు. మాజీ మహిళా కమిషన్ చైర్మన్ నన్నపనేని రాజకుమారి మాట్లాడుతూ, కళా రంగంలో నిష్ణాతులైన వారి మధ్య ప్రసంగించడం, రాజకీయ ఉపన్యాసాలు ఇచ్చినంత సులువు కాదని అన్నారు. ప్రదర్శించిన నాటకాలు చక్కని సందేశాన్ని పంచాయిని కళాకారులను ప్రశంసించారు. పట్టణ కళాకారుల సంఘం అధ్యక్షురాలు బుర్ర జయలక్ష్మి ఆలపించిన పద్యాలు ఆహుతులను ఆకట్టుకున్నాయి. అనంతరం బుర్ర సుబ్రహ్మణ్య శాస్త్రి స్మారక జాతీయ పురస్కారాన్ని అతిథుల చేతుల మీదుగా సీనియర్ పౌరాణిక రంగస్థల నటులు ఉప్పలపాడు సైదులుకు ప్రధానం చేశారు. సత్కారాన్ని స్వీకరించిన ఉప్పలపాడు సైదులు తమ స్పందన తెలియజేస్తూ, బుర్ర సుబ్రహ్మణ్య శాస్త్రి తో నాటక రంగంలో తమకున్న అనుభవాలను వివరించారు.

## భారీ చోరీలు...

## 190గ్రా బంగారం, 5లక్షలు నగదు చోరీ

**తెనాలి(జర్నలిస్ట్ ఫైల్)**విజయదశమి పండుగ ఆనందాన్ని ప్రజలు ఆస్వాదిస్తుంటే, చోరశిఖామణులు తమ చేతివాటం చూపించి తెనాలి నియోజక వర్గంలొ రెండు చోట్ల చోరీలకు తెగబడి, బంగారం, నగదు, ఐఫోన్లు దోచేయడం,కలకలం రేపుతుంది.
వివరాల్లోకి వెళితె,పట్టణంలోని చెంచుపేట లోని ఓ ఫంక్షన్ హాల్ వద్ద, పార్క్ చేసిన కారు అద్దాలు ధ్వంసం చేసి విలువైనబంగారు ఆభరణాలు, నగదుతో ఉన్న బ్యాగును గుర్తు తెలియని దుండగులు అపహరించుకు వెళ్లారు. తెలంగాణ రాష్ట్రానికి చెందిన ఐఆర్ఎస్ అధికారి శ్రీరామ్ శాంతిరాజు గత రాత్రి చెంచుపేటలోని ఒక ఫంక్షన్ హాల్ లో వివాహానికి హాజరయ్యారు. తిరిగి వెళ్లే క్రమంలో కారు వద్దకు వెళ్ళిచూడగా అద్దాలు ధ్వంసం కావడం,గమనించి,కారులోని బ్యాగ్ మాయమైనట్లు గుర్తించారు. బ్యాగులో మూడు ఆపిల్ ఫోన్లు, 5 లక్షల నగదు, 100 గ్రాముల బంగారు ఆభరణాలు, పాస్పోర్ట్,క్రెడిట్ కార్డ్ ఉన్నట్లు 3 టౌన్ పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులు పేర్కొన్నారు. పోలీసులు సీసీ కెమెరాలు పరిశీలించి నిందితుల కోసం గాలిస్తున్నారు. ఇదిలా ఉండగా, కొల్లిపర మండలం, తూములూరు గ్రామంలొ,గురువారం రాత్రి తాళం వేసి ఉన్న ఇంట్లో భారీ చోరీ జరిగింది.రైస్ మిల్లర్ మోటూరు మధుసూదనరావు ఇంట్లో బీరువా తాళాలుపగులగొట్టి సుమారు రూ.10 లక్షలు విలువ చేసే బంగారు ఆభరణాలు దోచుకు వెళ్లారు. మధుసూదన రావు రాజోలులో రైస్ మిల్ నడుపుతూ ఉంటాడు. ఆయన భార్య పిల్లలు పండుగ సదర్భంగా, ఇంటికి తాళం వేసి,నరసరావుపేట వెళ్లారు. ఇంటి తాళం పగలగొట్టి ఉండటం గమనించిన స్థానికులు వారికి సమాచారం ఇవ్వడంతొ, మదుసూధనరావుఇంటికి వచ్చి చూడగా, 96 గ్రాముల బగారు ఆభరణాలు మాయమైనట్లు గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేశారు.కొల్లిపర ఎస్సై కోటేశ్వరరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.నియోజకవర్గంలొ చోటుచేసుకున్న, రెండు చోరి సంఘటనల్లో, 190,గ్రాముల బగారం, 5,లక్షలు నగదు, ఐఫోన్లు చోరీ కాబడినట్లు సమాచారం.

## వాసవి అమ్మవారి సన్నిధిలో వైసిపి ప్రముఖులు



**బ్రహ్మంగారిమఠం (కడప జిల్లా)జర్నలిస్టు ఫైల్:** బ్రహ్మంగారిమఠం స్థానిక శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి దేవస్థానం నందు విజయదశమి శుభదినాన మైదుకూరు మాజీ ఎమ్మెల్యే శెట్టిపల్లి రఘురామి రెడ్డి బద్వేలు ఎమ్మెల్యే డాక్టర్ సుధా జడ్పీ చైర్మన్ రామ గోవిందరెడ్డి విచ్చేసి అమ్మవారిని దర్శించుకున్నారు నూతన అధ్యక్షులు అయ్యప్ప వెంకట సురేష్ బాబు మరియు కమిటీ సభ్యులు ఆలయ ప్రధాన అర్చకులు మధు శర్మతో ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థప్రసాదాలు ఇచ్చి దృశ్యాలువాతో ఘనంగా సత్కరించారు.. ఈ కార్యక్రమంలో కార్యదర్శి సుంకు సురేష్ బాబు మాజీ కమిటీ సభ్యులు ముచ్చర్ల శేషయ్య పబ్బుతి నాగేశ్వరరావు బింగి సుధాకర్ యువజన సంఘం అధ్యక్షుడు యాదళ్ళ వెంకటసుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు

## అంతర్ జిల్లా బదిలీల ఉత్తర్వు జారీ పట్ల ఏపీటీఎఫ్ హర్షం

**అమరావతి ( జర్నలిస్ట్ ఫైల్ ):** గత నాలుగు సంవత్సరముల నుండి అంతర్ జిల్లా బదిలీలు నిర్వహించాలని ప్రభుత్వాలకు ఏపీటీఎఫ్ ప్రాతినిధ్యం చేయడం నేడు ఉత్తరువు జారీ చేయడం జరిగింది. ఇందులో కు స్పౌజ్ కు సంబంధించి 134 మంది, మ్యూచువల్ కు సంబంధించి 124 మంది ప్రధానోపాధ్యాయులు, వివిధ కేడర్ల ఉపాధ్యాయులు మొత్తం 258 మందికి ఈ బదిలీలు నిర్వహిస్తున్నారని తెలిపారు. డీఎస్సీ నియామకాల కంటే ముందే నిర్వహించాలని ప్రభుత్వాన్ని కోరగా సానుకూలంగా స్పందించి ఈ బదిలీలు చేపడుతున్నందుకు విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ గారికి, ప్రభుత్వ కార్యదర్శి కోన శశిధర్ గారికి, పాఠశాల విద్య డైరెక్టర్ విజయరామరాజు గారికి ధన్యవాదములు తెలిపారు. ఐతే స్పౌజ్ విషయంలో చాలా మందిని అనర్హులుగా చేసి అవకాశం ఇవ్వకపోవడం బాధాకరం అని, వారికి కూడా పునఃపరిశీలించి అంతర్ జిల్లా బదిలీలకు అవకాశం కల్పించాలని ఏపీటీఎఫ పక్షాన డిమాండ్ చేశారు.

## పదోన్నతులపై టీఎన్ యూస్ హర్షం

**అమరావతి ( జర్నలిస్ట్ ఫైల్ ):** విజయదశమి సందర్భంగా రాష్ట్రవ్యాప్తంగా 1209 మంది డీఈవో పూల్ లాంగ్వేజ్ పండితులుకి స్కూల్ అసిస్టెంట్ లాంగ్వేజ్గా ప్రమోషన్ ఇచ్చిన సిఎస్సి మెమో నం. 14 విడుదలైంది. దీనిపై తెలుగు నాడు ఉపాధ్యాయ సంఘం (టిఎన్ యుఎస్) హర్షాన్ని వ్యక్తం చేస్తూ ప్రభుత్వానికి ధన్యవాదాలు తెలిపింది.
గత ఆరు సంవత్సరాలుగా శాశ్వత స్థానాలు లేకపోవడంతో, ఒకచోట పని చేసి, మరొకచోట జీతం తీసుకుంటూ కష్టపడుతున్న భాషా పండితులు ఈ నిర్ణయం తర్వాత నిజమైన వెలుగును చూసారు. ఇటీవల గౌరవ హైకోర్టు వారి హక్కులను పరిగణలోకి తీసుకున్నప్పటికీ సమస్య పరిష్కారం కాకుండా ఉండటంతో టిఎన్ యుఎస్ సమస్యను టిడిపి ఎమ్మెల్సీలకు మరియు విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ దృష్టికి తీసుకెళ్లింది.
ఈ కృషి ఫలితంగా, భాషా పండితుల జీవితాల్లో విజయదశమి రోజున సంకల్పిత వెలుగు నింపింది. భాషా పండితులు టిఎన్ యుఎస్ కృషికి అభినందనలు తెలిపారు. టిఎన్ యుఎస్ అధ్యక్షులు మన్నం శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి రామిశెట్టి వెంకటేశ్వర్లు ప్రత్యేక ప్రకటనలో లోకేష్, టిడిపి ఎమ్మెల్సీలు, డైరెక్టర్ విజరామరాజుకు ధన్యవాదాలు తెలిపారు.

# పెంఛన్లు పంపిణీ



**విజయవాడ, అక్టోబరు 3 (జర్నలిస్ట్ ఫైల్)**

తూర్పు నియోజకవర్గం 13వ డివిజన్ లోనీ 56 వ సచివాలయ ఎడ్యుకేషన్ డేటా ప్రాసెసింగ్ సెక్రటరీ సత్యదేవ్ లబ్ది దారుల ఇంటికి వెళ్లి నాలుగు వేల పించన్ ను అందచేశారు. పనులకు వెళ్ళే వారికి ఇబ్బంది లేకుండా ఉదయాన్నే అందచేశారు. వృద్ధులు, వికలాంగులైన ఫించనుదారులు బయటకు రాలేక అవస్థలు పడుతున్న తరుణంలో సచివాలయం సిబ్బంది ఇళ్ళకు వెళ్ళిఫించను ఇచ్చారు. ప్రభుత్వ ఆదేశాలు అవ్వా, తాత లకు ఆనందాన్ని కలిగిస్తున్నాయి.

# పెంఛన్లు పంపిణీ చేసిన 18వ డివిజన్ అధ్యక్షులు వేముల దుర్గారావు



**విజయవాడ, అక్టోబరు 3 (జర్నలిస్ట్ ఫైల్)**

కేంద్ర తెలుగుదేశం పార్టీ ఆదేశానుసారం, విజయవాడ తూర్పుశాసనసభ్యులు, గద్దె రామ మోహన్ ఆదేశానుసారం బుధవారం 18వ డివిజన్ రాణి గారి తోటలో, ఎన్టీఆర్ భరోసా పెన్షన్ ను 18వ డివిజన్ అధ్యక్షులు వేముల దుర్గారావు పంపిణీ చేశారు. క్లస్టర్ ఇంచార్జ్ తలపాటి ప్రసాద్ యూనిట్ యూనిట్ ఇంచార్జ్ మైలమూరి, పిరు బాబు, బూత్ కన్వీనర్, వేజర్ల కాశయ్య, పగడాల వెంకటేశ్వర రెడ్డి, బలగాని శ్రీను, మర్రి వెంకట సుబ్బయ్య,అంబటి కాశి, దేవల శ్రీ ను, వేల్పుల విజయ్, వేముల ఎల్లయ్య, గంద్ర వెంకటేశ్వరరావు, అంబటిపూడి దుర్గమ్మ నాగవరపు దుర్గారావు, తదితరులు పాల్గొన్నారు.

# జీఎస్టీ తగ్గింపుతో వ్యవసాయరంగానికి మేలు

## వ్యవసాయ శాఖ అధికారి జి.నాగేశ్వరావు



**నందిగామ, అక్టోబరు 3 (జర్నలిస్ట్ ఫైల్)**

కేంద్రప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రజల అవసరాలకు అనుగుణంగా జీఎస్టీ తగ్గింపు చేసినందుకు గాను రైతులకు,వ్యవసాయ రంగాల వారికి ఎంతగానో ఉపయెగపడుతుందని వ్యవసాయ శాఖ మండల అధికారి జి.నాగేశ్వరరావు అన్నారు. కేంద్రప్రభుత్వం వ్యవసాయ రంగానికి ఎంతగానో మేలు చేసే విధంగా 12%ఉన్న జీఎస్టీని 5%శాతానికి తగ్గించడం పై రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారని తెలిపారు.జీఎస్టీ తగ్గింపు పై పలు గామాల్లో వ్యవసాయ శాఖ ఆధికారులు రైతులకు,వ్యవసాయ రంగాలకు సంబంధించిన వారికి ఎవిధంగా లబ్ధిచేకూరుతుందో వివరించారు.వాటికి సంబంధించిన కరపత్రాలు ప్రజలకు ఎఓ నాగేశ్వరరావు, సిబ్బంది పంపిణీ చేశారు.ఈ కార్యక్రమంలో వ్యవసాయ శాఖ ఆధికారులు,రైతులు పాల్గొన్నారు.

# వృద్ధులకు అన్నదానం

## లక్ష్మీకుమారి,ప్రభాకరావు సేవలు అభినందనీయం



**నందిగామ, అక్టోబరు 3 (జర్నలిస్ట్ ఫైల్)**

దసరా–దీపావళి సందర్భంగా నందిగామ మండలం మాగల్లు గ్రామంలోని ఖాసిం అండ్ ఖాసిం వృద్ధుల ఆశ్రమంలో నందిగామ ప్రజాశక్తి విలేఖరి, ఎపి జర్నలిస్టు ఫెడరేషన్ సంఘ నాయకులు ఆకుల వెంకట నారాయణ ఆద్వర్యంలో కె. లక్ష్మీకుమారి–ప్రభాకర్ దంపతుల సౌజన్యంతో వారి మనుమడు ఆకుల నాగ సాయి మణికంఠ వృద్ధులకు, వితంతువులకు అన్నదానం నిర్వహించారు. పులి హెూర, గారెలు, రవ్వకేసరా తదితర తినుబండారాలను వడ్డిం చారు. వృద్ధులకు అన్నదానం చేయటంతోవారి నుండి అత్మీయ అభినందనలు లభించాయి. ఈ కార్యక్రమంలో ఆశ్రమ నిర్వాహకులు డా. హసీనా బేగం, డా. కరీముల్లా తదితరులు పాల్గొన్నారు.

# సూపర్ జీఎస్టీతో సూపర్ సేవింగ్స్

## ఎన్టీఆర్ జిల్లా జాయింట్ కలెక్టర్ ఎస్. ఇలక్కియ



**విజయవాడ, అక్టోబరు 3 (జర్నలిస్ట్ ఫైల్)**

సూపర్ జీఎస్టీతో రైతులకు, వ్యవసాయ రంగంలో ఉన్నవారికి చాలా లాభం చేకూరుతుందని జాయింట్ కలెక్టర్ ఎస్.ఇలక్కియ అన్నారు. బుధవారం విజయ వాడ గ్రామీణం నున్నలో సూపర్ జీఎస్టీపై జరిగిన అవగాహన కార్యక్ర మం, ర్యా లీలో జాయింట్ కలెక్టర్ పాల్గొన్నారు. జీఎస్టీ 2.0 సంస్కరణలతో రైతుల కు, వ్య వసాయ రంగంలో ఉన్నవారికి చేకూరే ప్రయోజనాలపై అవగాహన కల్పిం చారు. కొత్త జీఎస్టీతో రైతులకు చేయూత లభిస్తుందని తెలిపారు. వ్యవసాయం, వ్యవ సాయ అనుబంధ రంగాలకు ఉపయోగించే వస్తువులు పనిముట్లపై ఐదు శా తం జీఎస్టీ మాత్రమే ఉంటుందన్నారు. కొత్త జీఎస్టీలో బిందు సేద్యంపై రైతుల కు వివి ధ పంటల్లో ప్రయోజనాలు చేకూరుతాయని తెలిపారు. ఈ సంస్కరణ వల్ల రై తుల జీవన ప్రమాణాలు మెరుగుపడతాయని జాయింట్ కలెక్టర్ ఇలక్కియ అన్నారు.

# పెన్షన్లు ఒకేసారి పెంచడం చరిత్రాత్మకం నిర్ణయం

- దేశంలోనే మన ఆంధ్రప్రదేశ్ అత్యధిక పెన్షన్లు పంపిణీలో ప్రథమ స్థానంలో ఉన్నాము
- జిల్లాలో 2 లక్షల 60 వేల 765 మందికి 114.14 కోట్ల రూపాయలు పెన్షన్లదార్లకు పెన్షన్లు సొమ్ము పంపిణీ
- రాష్ట్ర మంత్రి కొలుసు పార్థసారథి, ఏలూరు జిల్లా కలెక్టరు కె.వెట్రిసెల్వి



**ఆగిరిపల్లి, అక్టోబరు 3 (జర్నలిస్ట్ ఫైల్)**

ఆగిరిపల్లి మండలం అడవినెక్కలం – డాక్టరు బి.ఆర్.అంబేద్కర్, బుద్దగూడెం కాలనీలలో బుధవారం ఎన్టీఆర్ భరోసా సామాజిక పెన్షన్లు ప్రతి గడపకు వెళ్ళి, వారి యోగక్షేమాలు, ఆరోగ్య పరిస్థితులు, గ్రామానికి ఇంకా అవసరమైన అభివృద్ధి కార్యక్రమాలను అడిగి తెలుసుకుని, లబ్దిదారులకు పెన్షన్లు సొమ్మును రాష్ట్ర గృహనిర్మాణ, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్థసారథి, జిల్లా కలెక్టరు కె.వెట్రిసెల్వి సంయుక్తంగా అందజేశారు. ముందుగా బుద్దగూడెం కాలనీ వద్ద బాబూ జగ్జీవన్ రామ్ విగ్రహానికి పూలమాలలు వేసి మంత్రి కొలుసు పార్థసారథి, జిల్లా కలెక్టరు కె.వెట్రిసెల్వి అంజలి ఘటించారు. ఈ సందర్భంగా మంత్రి కొలుసు పార్థసారథి మాట్లాడుతూ గత ప్రభుత్వం రాష్ట్రం మీద రూ 14 లక్షల కోట్ల అప్పులు భారం పెట్టినా, ఎన్నికల్లో ఇచ్చిన మాటను నిలబెట్టుకునేలా ఎన్డీఏ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన మొదటి నెలలోనే ఒకేసారి పెన్షన్లు పెంచి, మూడు నెలలు ఏరియర్సుతో కలిపి అందజేసామన్నారు. ప్రతినెల 01వ తేదీ ఉదయాన్నే ప్రతి గడపకు వెళ్ళి పెన్షన్లు సొమ్మును పంపిణీ చేస్తున్నామని, లబ్దిదారులు ముఖంలో చిరునవ్వు, కళ్ళల్లో ఆనందంతో ఎన్డీఏ కూటమి ప్రభుత్వానికి ఆశీస్సులు అందిస్తున్నారని తెలిపారు. రాష్ట్రంలో పెన్షన్లు దారులకు పంపిణీ చేసే సొమ్ము ఇతర రాష్ట్రాలతో పోలిస్తే పదిరెట్లు ఎక్కువ అని, దేశంలోనే మన రాష్ట్రం అత్యధిక పెన్షన్లు పంపిణీలో ప్రథమస్థానంలో ఉన్నామన్నారు. 01వ తేదీనే నూటికినూరు శాతం పెన్షన్లు దారులకు పెన్షన్లు పంపిణీ చెయ్య డానికి జిల్లా యంత్రాంగం అన్ని చర్యలు చేపట్టిం దని అన్నారు. ప్రతినెల మొదటి రోజునే సామాజిక పెన్షన్లు దారులతో పాటు ప్రభుత్వ ఉద్యోగులు, విశ్రాంత ఉద్యోగుకు కూడా జీతాలు అందిస్తున్నామని అన్నారు. గత ప్రభుత్వం సంవత్సరానికి రూ 250 రూపాయలు మాత్రమే పెన్షన్లు సొమ్ము పెంచేవారని, మన ప్రజా ప్రభుత్వంలో విడతలు వారీ కాకుండా ఒకేసారి పెంచి మూడు నెలలు బకాయిలు కలిపి లబ్దిదారులకు అందజేశామని అన్నారు. గత ప్రభుత్వంలో ఉద్యోగులు జీతాలు పెంచమని మాట అటుంచి మాకు జీతాలు 01వ తారీఖున ఇవ్వండి మహా ప్రభో అనేవారని మంత్రి తెలిపారు. గత ప్రభుత్వం రాష్ట్రాన్ని అప్పులు కుప్పగా చేస్తే రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకి అం డగా ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ సహకారంతో మన ఆంధ్రప్రదేశ్ లో అభివృద్ధి, సంక్షేమం పరుగులు పెట్టిస్తున్నామని అన్నారు .జిల్లా కలెక్టరు కె.వెట్రిసెల్వి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం పెద్ద మొత్తంలో సామాజిక పెన్షన్లు అందజే స్తున్నదని, సద్వినియోగం చేసుకుని మంచి ఆరోగ్యంతో సమాజంలో గౌరవంగా జీవించాలని అన్నారు. పింఛన్ల ను ఇంటింటికీ వెళ్ళి పంపిణీ చేసేలా సిబ్బందికి ఆదేశా లు జారీ చేయడం జరిగిందన్నారు. ఏరాష్ట్రంలో లేని విధంగా మన రాష్ట్ర ప్రభుత్వం ఇంత పెద్ద మొత్తంలో పెన్షన్లు అందజేయడం జరుగు చున్నదని, లబ్దిదారులు భవిష్యత్తు అవసరాలు కోసం కొంతపొదుపు చేసుకోవా లని సూచించారు. 01వ తేదీనే నూరుశాతం పెన్షన్లు దారులకు పెన్షన్లు పంపిణీ చేయడం జరుగుతుందని, అనివార్య కారణాలచేత 1వ తేదీన తీసుకొని పెన్షన్లుదా రులు 03వ తేదీన పంపిణీ చేయడం జరుగుతు ందన్నా రు. జిల్లాలోని 5175 మంది సచివాలయ మరియు ఇతర ప్రభుత్వ శాఖల సిబ్బందితో పెన్షన్లు పంపిణీ చేయడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్ర మంలో సబ్ కలెక్టరు బొల్లిపల్లి వినూత్న, యంపిడివో బి.భార్గవి, డిప్యూటీ తహశీల్దారు జి.పవన్ కుమార్, మండల వివిధ శాఖల అధికారులు, కూటమి నాయకు లు, వివిధం కాలు సామాజిక పింఛన్లుదారులు, వారి కుటుంబ సభ్యులు, స్థానిక ప్రజలు, తదితరులు పాల్గొన్నారు.

# ఎన్టీఆర్ భరోసాతో పేదలకు సామాజిక భద్రత

- ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ



**విజయవాడ, అక్టోబరు 3 (జర్నలిస్ట్ ఫైల్)**

పేద ప్రజల సామాజిక భద్రతే ప్రభుత్వ లక్ష్యమని ఎన్టీఆర్ భరోసా ద్వారా పేదల జీవన ప్రమాణాలను పెంచడంతో పాటు, పేదరికం లక్ష్యంగా ప్రభుత్వం పలు సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తుందని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ డా. జి .లక్ష్మీశ అన్నారు. ఎన్టీఆర్ భరోసా పథకం కింద సామాజిక భద్రత పెన్షన్ల పంపిణీలో భాగంగా బుధవారం జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ విజయవాడ అర్బన్ 14వ వార్డు పుట్టా రోడ్ ప్రాంతంలో అధికారులతో కలిసి లబ్ధిదారులకు సామాజిక భద్రత పెన్షన్లను పంపిణీ చేసే కార్య క్రమంలో పాల్గొన్నారు.ఈ సందర్భంగా లబ్దిదారులను స్వయంగా కలిసి పెన్షన్లు అందిస్తున్న ప్రక్రియ గురించి అడిగి తెలుగుసుకున్నారు. లబ్ధిదారులను ఆత్మీయంగా పలకరిస్తూ సమస్యలు ఏవైనా ఉన్నాయా అని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ అవకతవకలకు తావులేకుండా అత్యంత పారదర్శకత జవాబుదారీతనంతో ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా పెన్షన్ల మొత్తాన్ని లబ్ధిదారుల ఇళ్లవద్దే అందిస్తున్నట్లు తెలిపా రు. గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో అధికారుల ప్రత్యక్ష పర్యవేక్షణలో ఎక్కడా ఎలాంటి ఇబ్బంది లేకుండా లబ్ధిదారులకు పెన్షన్లు అందిస్తు న్నామన్నారు. జిల్లాలో సామాజిక భద్రత పెన్షన్ల ద్వారా 2,29,874 మంది లబిద్దారులకు పెన్షన్లు పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. వివిధ క్యాటగిరీల పెన్షన్లకు సంబంధించి రూ. 99 కోట్ల 27 లక్షల మొ త్తాన్ని లబ్దిదారులకు అందజేయడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ లక్ష్మీశ తెలిపారు.

# వృద్ధులు కాళ్ళకు నమస్కరించి, ఆశీస్సులు అందుకున్న మంత్రి కొలుసు పార్థసారథి



**ఆగిరిపల్లి, అక్టోబరు 3 (జర్నలిస్ట్ ఫైల్)**

ఆగిరిపల్లి మండలం అడవినెక్కలం – గ్రామ సచివాలయం వద్ద బుధవారంప్రపంచ వృద్ధుల దినోత్స వం సందర్భంగా వృద్ధులకు పూలమాలలు, శాలువాలు కప్పి, పండ్లను అందించి మంత్రి కొలుసు పార్థసారథి, జిల్లా కలెక్టరు కె.వెట్రిసెల్వి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా మంత్రి కొలుసు పార్ధ సారథి మాట్లాడుతూ వృద్ధులు పట్ల సమాజంలో పెరుగు తున్న నిర్లక్ష్యం, వారి హక్కుల పరిరక్షణ ఆవశ్యకతను తెలియజేయడానికి అక్టోబరు 01వ తేదీన వృద్ధులు దినోత్సవం జరుపు కుంటున్నామని తెలిపారు. వృద్ధుల కు గౌరవం, సంరక్షణ, అనుభవాలను గుర్తించడం, వృద్ధాప్య సంరక్షణ వ్యవస్థలను బలోపేతం చేయడం మనందరి బాధ్యత అన్నారు. నేటికాలంలో వృద్ధులకు సరైన సంరక్షణ, ఆదరణ లేదని ఆవేదన వ్యక్తం చేస్తూ, కొన్ని ఏళ్ళు తర్వాత మనం కూడా వృద్ధాప్య దశకు వస్తామని ప్రతి ఒక్కరూ గుర్తు పెట్టుకోవాలని అన్నారు.ఉమ్మడి కుటుంబాలు కనుమరుగవడంతో చాలా మంది వృద్ధులు ఒంటరితనం, అశ్రయానికి గురవుతున్నారని అన్నారు. వారికి బాసటగా నిలబడి, సమాజంలో గౌరవంగా జీవించేలా చూడవలసిన బాధ్యత మనపై ఉందన్నారు.జిల్లా కలెక్టరు కె.వెట్రిసెల్వి మాట్లాడుతూ వృద్ధులకు ఆర్థిక భద్రత, గౌరవం, ఆరోగ్య సంరక్షణ, హక్కులను పరిరక్షించవలసిన బాధ్యత సమాజంతో పాటు మనందరిపై ఉందన్నారు. నేటియువత వారి అనుభవాలను నేర్చుకుని, గౌరవించి వారి సూచనలు, సలహాలను స్వీకరించాలని అన్నారు. వృద్ధులపట్ల నిర్లక్ష్యం, వేధింపులు వంటి సమస్యలుపై అవగాహన కలిగించాలని అన్నారు. భద్రతతో కూడిన జీవితాన్ని వృద్ధులకు అందించడానికి ప్రతి ఒక్కరూ ముందుకు రావాలని జిల్లా కలెక్టరు పిలుపునిచ్చారు. ఈ కార్య క్రమంలో సబ్ కలెక్టరు బొల్లిపల్లి వినూత్న, జిల్లా వ్యవసాయ జెడి షేక్ హబీబ్ భాషా, జిల్లా పరిషత్తు సిఇవో యం.శ్రీహరి, యంపిడివో బి.భార్గవి, డిప్యూటీ తహశీల్దారు జి.పవన్ కుమార్, వివిధ శాఖల అధికారులు, సచివాలయ ఉద్యోగులు, కూటమి నాయకులు, రైతులు, గ్రామ ప్రజలు, వృద్ధులు వారి కుటుంబ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

# జీఎస్టీ సవరించడం వల్ల పేదలకు మేలు

- ప్రభుత్వ విప్, గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు



**గన్నవరం, అక్టోబరు 3 (జర్నలిస్ట్ ఫైల్)**

కృష్ణా జిల్లా, గన్నవరం మండలం, కేంద్ర ప్రభుత్వం జీఎస్టీ తగ్గించడం ద్వారా పేద మధ్య తరగతి ప్రజలకు ఎంతో మేలు కలుగుతుందని ప్రభుత్వ విప్, గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు తెలిపారు. బుధవారం ఉదయం గన్నవరం మండలం కేసరపల్లి గ్రామంలో ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్న యార్లగడ్డ లబ్ధిదారులకు పింఛన్లు అందజేశారు. ఈ సందర్భంగా ప్రజల సమస్యలను అడిగి తెలుసుకొని వాటిని పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ జీఎస్టి పన్ను తగ్గించడం ద్వారా పేద మధ్య తరగతి ప్రజలకు ప్రతినెలా రూ.15 వందల రూపాయల వరకు ఆదావుతుందన్నారు. గడిచిన మూడు నాలుగు రోజుల్లో తాను పలు దుకాణాలలో విక్రయాలను పరిశీలించి కొనుగోలు దారులు, విక్రయదారులతో మాట్లాడగా పన్ను తగ్గింపు వల్ల వస్తువులు రేట్లు తగ్గినట్లు చెప్పారన్నారు. సరుకుల ధరలు తగ్గటం వల్ల కొనుగోళ్ళ పెరిగాయని తద్వారా వ్యాపారం పెరిగినట్లు తెలిసిం దన్నారు. గ్రామ పంచాయతీలను ఆర్థికంగా బలోపేతం చేసేందుకుగాను కేసరపల్లి గ్రామపంచాయతీ ఆధ్వర్యం లో కాఫీ షాప్ ను ప్రారంభించినట్లు వెంకట్రావ్ వివరిం చారు. గన్నవరం నియోజకవర్గంలోని పలు గ్రామాల్లో క్రికెట్ బాక్సులు ఏర్పాటు చేయనున్నట్లు చెప్పారు. క్రికెట్ బాక్సు ఏర్పాటు ద్వారా గ్రామాల్లో యువకులకు క్రికెట్ ఆడుకునేందుకు వీలు కలుగుతుందని ఇదే సమయ ంలో పంచాయతీ ఆదాయం వస్తుంది అన్నారు. గన్నవరం నియోజకవర్గ పరిధిలో కొందరు అధికారులు సమస్యల పరిష్కారం పట్ల అలసత్వం వహిస్తున్నారని అలసత్వాన్ని వీడాలని యార్లగడ్డ హెచ్చరిం చారు. ప్రతి నెల ఇంటింటికి వెళ్లి పింఛన్లు పంపిణీ చేయడం ద్వారా ప్రజల సమస్యలు తెలుసుకునేందుకు వీలు కలుగు తుందన్నారు. గన్నవరం నియోజకవర్గ అభివృద్ధే ధ్యేయంగా ముందుకు సాగుతున్నట్లు యార్లగడ్డ తెలిపారు. పింఛన్ల పంపిణీ అనంతరం కేసరపల్లి గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన కుంభకోణం కాఫీ షాప్ ను ఎమ్మెల్యే యార్లగడ్డ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు గొడ్డళ్ళ చిన్న రామారావు, చిరుమామిళ్ల సూర్యం, బచ్చుల బోసు, గూడపాటి తులసి మోహన్, ఎం ఎల్ వి ప్రసాద్, సర్పంచ్ చేబ్రోలు మౌనిక, ఈవో ప్రసాద్, అన్నే హరికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## మున్సిపల్ కమీషనర్ గా.... బాధ్యతలు చేపట్టిన శ్రీరామ అప్పలనాయుడు



**తెనాలి,(జర్నలిస్ట్ ఫైల్):** తెనాలి మున్సిపల్ కమిషనర్ గా శ్రీరామ అప్పలనాయుడు శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. నూతన కమిషనర్ శ్రీరామ అప్పలనాయుడు పురపాలక సంఘ కార్యాలయానికి చేరుకోగానే, వివిధ విభాగాల అధికారులు ఆయనకు సాదర స్వాగతం పలికారు. ఈక్రమంలో తొలుత చైర్ పర్సన్ ఛాంబర్ కు వెళ్లిన అప్పలనాయుడు, చైర్ పర్సన్ తాడిబోయిన రాధికకు పుష్పగుచ్ఛం అందజేసారు. అనంతరం తమ చాంబర్లో నూతన కమిషనర్ అప్పలనాయుడు బాధ్యతలు చేపట్టారు. ఈసందర్భంగా అప్పల నాయుడు మీడియాతో మాట్లాడుతూ విజయనగరం జిల్లా రాజాం నుండి బదిలీపై వచ్చినట్లు తెలిపారు. ప్రజా ప్రతినిధుల ప్రోత్సాహంతో సహచర ఉద్యోగుల తోడ్పాటుతో, పట్టణ అభివృద్ధి కోసం తమవంతుగా కృషి చేస్తామన్నారు. తమ పరిధిలోని వివిధ అంశాలపై క్షుణ్ణంగా పరిశీలించి తగు నిర్ణయాలు తీసుకుంటామన్నారు. ఈ సందర్భంగా ఇంజనీరింగ్ విభాగం అధికారులు, టౌన్ ప్లానింగ్ అధికారులు ఎంహెచ్ఓ ఏసుబాబు, డిఇ శ్రీకాంత్, తదితర సిబ్బంది, నూతన కమిషనర్ అప్పలనాయుడును కలిసి అభినందనలు తెలిపారు.

## ఆక్రమణలు తొలగించండి



**ఉమ్మడి గుంటూరు జిల్లా బ్యూరో (జర్నలిస్ట్ ఫైల్) :** రోడ్ల మీద ట్రాఫిక్ సమస్య, డ్రైన్లపై మురుగుపారుదలకు అడ్డుగా ఉన్న ఆక్రమణలను తొలగించాలని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు పట్టణ ప్రణాళిక అధికారులను ఆదేశించారు. శుక్రవారం కమిషనర్ పట్టాభిపురం మెయిన్ రోడ్, భాగ్య నగర్, తుఫాన్ నగర్, మారుతి నగర్ తదితర ప్రాంతాల్లో పర్యటించి, పారిశుధ్య, అభివృద్ధి పనులను పరిశీలించి సంబందిత అధికారులకు తగు ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ వర్షం నీరు డ్రైన్లలో సక్రమంగా వెళ్లడానికి వీలు లేకుండా, ట్రాఫిక్ కి అంతరాయంగా ఆక్రమణలు ఉండడానికి వీలు లేదని, ఇప్పటికే పలుమార్లు వారికి ఆక్రమణలను స్వచ్ఛందంగా తొలగించుకోవాలని తెలిపినందున పట్టణ ప్రణాళిక అధికారులు తొలగించాలని ఆదేశించారు. రోడ్ల వెంబడి ఉన్న టీ స్టాల్స్, టిఫిన్ స్టాల్స్ వారు వ్యర్థాలను డ్రైన్ల వేస్తున్నారని, దీని వలన చిన్నపాటి వర్షాలకు కూడా డ్రైన్లు ఓవర్ ఫ్లో జరిగి ప్రజలు ఇబ్బందులు పడుతున్నందున, అటువంటి వారి ఆక్రమణలు తొలగించడంతో పాటు భారీ మొత్తంలో అపరాధ రుసుం విధించాలన్నారు. పర్యటనలో పట్టణ ప్రణాళిక, ఇంజినీరింగ్, ప్రజారోగ్య అధికారులు, సచివాలయ కార్యదర్శులు పాల్గొన్నారు.

## ఉత్తమ స్వచ్ఛ హాస్పిటల్ గా ఇందిరానగర్ యూపీహెచ్సీలి




**మంగళగిరి (జర్నలిస్ట్ ఫైల్):** ప్రభుత్వం వివిధ కేటగిరీలలో ప్రకటించిన స్వచ్ఛ ఆంధ్ర- 2025 అవార్డులకు మంగళగిరి ఎల్బీనగర్ సచివాలయం పరిధిలోని గణపతి నగర్లోని ఇందిరా నగర్ యూపీహెచ్సీ జిల్లాస్థాయిలో ఉత్తమ స్వచ్ఛ హాస్పిటల్ గా ఎంపికయింది. ప్రభుత్వం గురువారం ప్రకటించిన జిల్లా, రాష్ట్రస్థాయి స్వచ్ఛ ఆంధ్ర అవార్డుల జాబితాలో ఇందిరానగర్ యూపీహెచ్సీ జిల్లాస్థాయిలో ఉత్తమ స్వచ్ఛ హాస్పిటల్ గా స్థానం సంపాదించుకుంది. ఈ సందర్భంగా హెల్త్ సెంటర్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ పీ అనూష మాట్లాడుతూ హెల్త్ సెంటర్ జిల్లాలో ఉత్తమ స్వచ్ఛ హాస్పటల్ గా ఎంపిక అవ్వడం సంతోషంగా ఉందన్నారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, రాష్ట్ర మంత్రివర్యులు నారా లోకేష్, ఎన్పీసీడీ జాయింట్ డైరెక్టర్ డాక్టర్ సునీల్ నాయక్, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ కె విజయలక్ష్మి లకు ఆమె ధన్యవాదాలు తెలిపారు. భవిష్యత్తులో హాస్పటల్లో మరింత పరిశుభ్రంగా ఉండటానికి తమ వంతు కృషి చేస్తామన్నారు.

## గుంటూరు పశ్చిమ అభివృద్ధికి సహకరించండి

- మంత్రి లోకేష్ కు ఎమ్మెల్యే గళ్ళా మాధవి విజ్ఞప్తి



**గుంటూరు( జర్నలిస్ట్ ఫైల్ ):** మంత్రి నారా లోకేష్‌ను గుంటూరు పశ్చిమ ఎమ్మెల్యే గళ్ళా మాధవి శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా తాజా రాజకీయ పరిణామాలతో పాటు నియోజకవర్గ అభివృద్ధి కార్యక్రమాలు, ప్రజా సమస్యలు, ఆగిపోయిన ప్రాజెక్టులపై చర్చించారు. పలు ముఖ్యమైన వినతిపత్రాలను ఆమె మంత్రి నారా లోకేష్‌కు అందజేశారు. ఎమ్మెల్యే గళ్ళా మాధవి మాట్లాడుతూ గుంటూరులో అనేక అభివృద్ధి కార్యక్రమాలు మధ్యలోనే ఆగిపోయాయని, అవి పూర్తయితే ప్రజలకు ఎంతో ఉపయోగకరంగా ఉంటాయని తెలిపారు. వాటిని తిరిగి ప్రారంభించి త్వరగా పూర్తి చేయడానికి నిధులు కేటాయించాలని కోరారు. ఆమె ప్రత్యేకంగా 2018లో అనుమతి పొందిన బీసీ భవన్ నిర్మాణ పనులు వైసీపీ ప్రభుత్వ నిర్లక్ష్యం వల్ల నిలిచిపోయాయని గుర్తు చేశారు. వెంటనే నిధులు విడుదల చేసి ఈ భవనాన్ని పూర్తి చేయాలని విజ్ఞప్తి చేశారు.

అలాగే, 2016లో రూ. 903 కోట్ల అంచనాతో ప్రారంభమైన భూగర్భ మురుగునీటి పారుదల ప్రాజెక్టు ఇంకా పూర్తికాలేదని తెలిపారు. ఇప్పటికే 400 కోట్లకుపైగా ఖర్చు అయిన ఈ పనిని త్వరగా పూర్తి చేయాలని కోరారు. 2013లో ప్రారంభమైన అంబేద్కర్ భవన్ మరియు స్టడీ సర్కిల్ పనులు రూ. 3 కోట్ల ప్రజా ధనం ఖర్చయినా ఇంకా అసంపూర్ణంగానే ఉన్నాయని తెలిపారు. మిగిలిన పనులు పూర్తి చేసి సమాజానికి ఉపయోగకరంగా మార్చాలని విజ్ఞప్తి చేశారు.

అలాగే బృందావన్ గార్డెన్స్‌లో నిర్మాణంలో ఉన్న నార్ల వెంకటేశ్వరరావు ఆడిటోరియం కూడా అసంపూర్ణంగానే ఉందని గుర్తు చేశారు. ఇది పూర్తయితే గుంటూరుకు ఒక సాంస్కృతిక ఆభరణంగా నిలుస్తుందని అన్నారు.

ఈ ప్రాజెక్టులు పూర్తికావడం వల్ల వెనుకబడిన వర్గాలు, విద్యార్థులు, కళాకారులు, సామాన్య ప్రజలు అందరూ ప్రయోజనం పొందుతారని ఎమ్మెల్యే గళ్ళా మాధవి నమ్మకం వ్యక్తం చేశారు.

ఎమ్మెల్యే గళ్ళా మాధవి వినతులపై మంత్రి నారా లోకేష్ సానుకూలంగా స్పందించారు. అభివృద్ధి కార్యక్రమాల పూర్తి కోసం తప్పనిసరిగా సహకారం అందిస్తానని హామీ ఇచ్చారు.

## నరసరావుపేటలో ఉద్యమ్ రిజిస్ట్రేషన్ వర్క్‌షాప్

- అభివృద్ధిలో ప్రపంచ దేశాలతో పోటీ పడాలి
- సూపర్ జి ఎస్ టి.సూపర్ సేవింగ్స్ బ్రోచర్ ఆవిష్కరణ




**ఉమ్మడి గుంటూరు జిల్లా బ్యూరో (జర్నలిస్ట్ ఫైల్)** అభివృద్ధిలో ప్రపంచవ్యాప్తంగా అభివృద్ధి చెందిన దేశాలతో పోటీపడాలని నరసరావుపేట ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద బాబు అన్నారు. శుక్రవారం నరసరావుపేట మున్సిపాలిటీ కార్యాలయంలో 'వర్క్‌షాప్ ఆన్ ఉద్యమ్ రిజిస్ట్రేషన్ ప్రోగ్రామ్' విజయవంతంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న నరసరావుపేట ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద బాబు 'సూపర్ జీఎస్టి సూపర్ సేవింగ్స్' బ్రోచర్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమం MSMEల అభివృద్ధికి దోహదపడేలా రూపొందించబడింది. ఎమ్మెల్యే మాట్లాడుతూ ఎం ఎస్ ఎం ఈ.ల అభివృద్ధిలో నిర్లక్ష్యం దేశ ఆర్థిక వ్యవస్థకు ముప్పుగా మారుతోందని, అమెరికా, రష్యా వంటి అభివృద్ధి చెందిన దేశాల నుండి మనం కీలక పాఠాలు నేర్చుకోవాలని పిలుపునిచ్చారు. గతంలో ఆహారం లేక ఆర్థిక సంక్షోభంలో ఉన్న దేశాలు అనతి కాలంలోనే అభివృద్ధి చెందాయని అన్నారు. కార్యక్రమంలో స్థానిక వ్యాపారులు, యజమానులు, అధికారులు పాల్గొన్నారు. ఉద్యమ్ రిజిస్ట్రేషన్ ప్రక్రియలో సులభతలు, సేవింగ్స్ గురించి వివరణాత్మక చర్చ జరిగింది. ఎమ్మెల్యే చదలవాడ అరవింద బాబు ప్రసంగిస్తూ ఎం ఎస్ ఎం ఈ "లు దేశ ఆర్థిక వ్యవస్థలో మూలస్తంభం. కానీ, క్షేత్రస్థాయిలో చిన్న వ్యాపారులకు రుణ సహాయం, అభివృద్ధి కార్యక్రమాల్లో నిర్లక్ష్యం ఉంది. ఇది ఎం ఎస్ ఎం ఈ.లను 'నేల విడిచి సాగు' చేస్తున్నట్లుగా ఉంది . భారతదేశ ఆర్థిక అభివృద్ధిలో రాజకీయ నాయకులతో పాటు అధికారులు కూడా చిత్త శుద్ధితో పని చేయాలి అని అన్నారు.

అమెరికా, రష్యా వంటి దేశాలు ఎం ఎస్ ఎం ఈలకు (ఎస్ ఎం ఈ ఎస్ అని అక్కడ పిలుస్తారు) అందిస్తున్న మద్దతును ఉదాహరణగా చెప్పారు. అమెరికాలో ఎస్ ఎం ఈ ఎస్ ఆర్థిక వ్యవస్థలో 99% భాగస్వాములు, మొత్తం ఉద్యోగాలలో 47% సృష్టిస్తాయి. వరల్డ్ బ్యాంక్ మద్దతుతో ఎస్ ఎం ఈ ఎస్ కు ఫైనాన్సింగ్, ట్రైనింగ్ ప్రోగ్రామ్‌లు అందుబాటులో ఉన్నాయి, ఇది వారి ప్రొడక్టివిటీని పెంచుతుంది. రష్యాలో 6 మిలియన్‌కు పైగా ఎస్ ఎం ఈ ఎస్ ఉన్నాయి, ప్రభుత్వం 'వన్-స్టాప్ షాప్' సర్వీస్‌లు, కాన్సెషనల్ లెండింగ్ ప్రోగ్రామ్‌లు ద్వారా మద్దతు ఇస్తోంది. 2025లో రష్యన్ ప్రభుత్వం ఎస్ ఎం ఈ ల కు ఎక్స్చేంజ్ లిస్టింగ్ ఖర్చులకు 15 మిలియన్ రూబుల్స్ వరకు సబ్సిడీలు ఆమోదించింది. "ఈ దేశాలు చిన్న వ్యాపారులకు సులభమైన రుణాలు, ఆవిష్కరణలు ప్రోత్సహిస్తూ ఆర్థిక వృద్ధిని సాధిస్తున్నాయి. మనం కూడా ఇలాంటి మోడల్స్‌ను అనుసరించి, ఎం ఎస్ ఎం ఈ లను బలోపేతం చేయాలి" అని ఎమ్మెల్యే సూచించారు.

ఈ కార్యక్రమం ఎం ఎస్ ఇ లకు ఉద్యమ్ రిజిస్ట్రేషన్ ప్రక్రియను సులభతరం చేసి, జి.ఎస్.టి సేవింగ్స్ గురించి అవగాహన కల్పించింది. స్థానికులు ఈ బ్రోచర్‌ను స్వాగతించుతూ, ప్రభుత్వ మద్దతు మరింత పెరగాలని కోరారు.

## ఆహారం త్వరగా ఇవ్వలేదని.. హెూటల్‌పై వైసీపీ నేత దౌర్జన్యం

- పల్నాడు జిల్లా సత్తెనపల్లిలో ఘటన
- వైసీపీ అధికార ప్రతినిధి దౌర్జన్యం
- యజమానితో పాటు ఇద్దరు సిబ్బందికి గాయాలు
- పోలీసులకు ఫిర్యాదు చేసిన బాధితులు

**ఉమ్మడి గుంటూరు జిల్లా బ్యూరో (జర్నలిస్ట్ ఫైల్)** పల్నాడు జిల్లాలో అధికార వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి చెందిన ఓ నేత వివాదంలో చిక్కుకున్నారు. కేవలం ఆహారం అందించడం ఆలస్యమైందన్న చిన్న కారణంతో ఓ హెూటల్ సిబ్బందిపై ఆయన, ఆయన అనుచరులు దాడికి పాల్పడిన ఘటన సత్తెనపల్లిలో చోటుచేసుకుంది. ఈ ఘటనపై బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో విషయం వెలుగులోకి వచ్చింది. సత్తెనపల్లిలోని గుడ్‌మార్నింగ్ హెూటల్‌కు వైసీపీ అధికార ప్రతినిధి నాగార్జున యాదవ్ తన అనుచరులతో కలిసి వెళ్లారు. అక్కడ తాము ఆర్డర్ చేసిన ఆహారం తీసుకురావడం ఆలస్యం కావడంతో ఆయన తీవ్ర ఆగ్రహానికి గురయ్యారు. ఈ క్రమంలో హెూటల్ యజమాని శేఖర్‌తో పాటు ఇతర సిబ్బందితో వాగ్వాదానికి దిగారు. మాటామాటా పెరగడంతో నాగార్జున యాదవ్, ఆయన అనుచరులు సిబ్బందిపై చేయి చేసుకున్నట్లు బాధితులు ఆరోపిస్తున్నారు. ఈ దాడిలో ఇద్దరు హెూటల్ సిబ్బందికి గాయాలయ్యాయి. అంతేకాకుండా, "మాకు ఎదురుతిరిగితే మావాళ్లు అంతా వస్తారు" అంటూ నాగార్జున యాదవ్ తమను బెదిరించినట్లు హెూటల్ సిబ్బంది తమ ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ ఘటన అనంతరం బాధితులు సత్తెనపల్లి పోలీస్ స్టేషన్‌ను ఆశ్రయించి, నాగార్జున యాదవ్‌పై ఫిర్యాదు చేశారు. బాధితుల నుంచి వివరాలు స్వీకరించిన పోలీసులు, వైసీపీ నేతపై కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు.

## మంత్రి లోకేష్‌కు ధన్యవాదాలు



**మంగళగిరి (జర్నలిస్ట్ ఫైల్):** ఉండవల్లిలో రాష్ట్ర మంత్రివర్యులు నారా లోకేష్ నివాసంలో శుక్రవారం ఇటీవల నూతనంగా నియమితులైన రాష్ట్ర మైనారిటీస్ ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్ ఎండీ ఇబ్రహీం, తన కుటుంబ సభ్యులతో మంత్రి లోకేష్ ను కలసి ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా ఇబ్రహీం మాట్లాడారు. పార్టీలో తన సీనియార్టీని గుర్తించి నామినేట్ పదవి ఇచ్చిన మంత్రి నారా లోకేష్ ను కుటుంబ సభ్యులతో కలసి వెళ్లి కృతజ్ఞతలు తెలియజేశామన్నారు. పార్టీలో అందరిని కలుపుకొని వెళ్లి మైనారిటీస్, నియోజకవర్గం, పార్టీ అభివృద్ధికి కృషి చేయాలని మంత్రి లోకేష్ సూచించారని ఆయన అన్నారు. మంత్రి లోకేష్ తమపై నమ్మకంతో అప్పగించిన బాధ్యతను సమర్థవంతంగా నిర్వహిస్తామన్నారు. ఎండీ రఫీ, నజీర్, జావీద్, ఆరిఫ్, షరీఫ్, మంత్రి లోకేష్ ను కలసిన వారిలో ఉన్నారు.

## బీజేపీ ఆధ్వర్యంలో గాంధీ, శాస్త్రి జయంతి



**గుంటూరు( జర్నలిస్ట్ ఫైల్ ):** గుంటూరు జిల్లా బీజేపీ ఆధ్వర్యంలో మహాత్మా గాంధీ, లాల్ బహదూర్ శాస్త్రి జయంతి వేడుకలు కొరిటిపాడు పార్క్ సెంటర్‌లో ఘనంగా జరిగాయి. జిల్లా అధ్యక్షుడు చెరుకూరి తిరుపతిరావు నేతృత్వంలో జరిగిన ఈ కార్యక్రమానికి మేయర్ కోవెలమూడి రవీంద్ర (నాని), బీజేపీ సీనియర్ నాయకుడు జూపూడి రంగరాజు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు.

భారతమాత, గాంధీజీ, శాస్త్రిజీ చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం పారిశుద్ధ కార్మికులకు పాదాభిషేకం చేసి కొత్త వస్త్రాలను అందజేశారు. ప్రధాని నరేంద్ర మోడీ జీవిత చరిత్రపై ఎగ్జిబిషన్, గో ఆధారిత ఉత్పత్తుల స్టాల్స్, ఖాదీ సంతను ఏర్పాటు చేశారు. మేయర్ రవీంద్ర, జూపూడి రంగరాజు రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు.

జూపూడి రంగరాజు మాట్లాడుతూ– "మోడీ 11 ఏళ్ల పాలనలో దేశం ఎన్నో రంగాల్లో అభివృద్ధి చెందింది. అంత్యోదయ పథకాలతో చివరి పౌరుడికి సాయం అందుతోంది. జీఎస్టీ తగ్గింపు వల్ల ప్రజల కొనుగోలు శక్తి పెరిగింది. స్వదేశీ ఉత్పత్తులు వినియోగిస్తే దేశ ఆర్థిక వ్యవస్థ మరింత బలపడుతుంది" అన్నారు.

మేయర్ కోవెలమూడి రవీంద్ర మాట్లాడుతూ– "మోడీ నిధుల మద్దతుతో రాష్ట్రానికి, నగరానికి ప్రాధాన్యత పెరిగింది. ఫ్లైఓవర్ పనులు వేగంగా మొదలయ్యాయి. స్వదేశీ వస్తువులను ప్రోత్సహిస్తే ఉద్యోగ అవకాశాలు పెరుగుతాయి" అని పేర్కొన్నారు.

ఈ కార్యక్రమంలో టొబాకో బోర్డు చైర్మన్ చిడిపోతు యశ్వంత్, ఐటీ సెల్ కన్వీనర్ మకుటం శివ, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఈదర శ్రీనివాస్ రెడ్డి, శనక్కాయల అరుణ, జిల్లా సంయోజకుడు భీమినేని చంద్రశేఖర్, పాలపాటి రవి, వెలగలేటి గంగాధర్, కొత్తూరి వెంకట సుబ్బారావు, నేరళ్ళ మాధవరావు, పాండు రంగావితల్, టీవీ రావ్, చరక కుమార్ గౌడ్, డా. శనక్కాయల ఉమాశంకర్, బజరంగ్ రామకృష్ణ, దేసు సత్యన్నారాయణ, తోట శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

## ప్రముఖ రచయిత పరుచూరి నారాయణచార్యులు (లల్లాదేవి) మృతి.



**ప్రత్తిపాడు(జర్నలిస్ట్ ఫైల్):** ప్రముఖ రచయిత పరుచూరి నారాయణ ఆచార్యులు(కలంపేరు. లల్లాదేవి) శుక్రవారం ఉదయం వారి స్వగ్రామమైన గుంటూరు జిల్లా ప్రత్తిపాడు మండలం, నిమ్మగడ్డవారిపాలెంలో మృతి చెందారు. వారు గత కొన్ని రోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్నారని తెలిసింది. వారికి భార్య ఆదిలక్ష్మి, కుమారుడు నందగోపాల్, కుమార్తె హరి ప్రసన్నారాణి ఉన్నారు. ఆయన మృతి పట్ల పలువురు అభిమానులు, ప్రముఖులు దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. తను రచయితగా వ్రాసిన వివిధ మాస పత్రికలు, వార పత్రికలు, పక్షపత్రికలు, దినపత్రికలందు సుమారు 40 సీరియల్స్ పైగా వెలువడ్డాయి. ఆయన రచించిన కథలు, జానపద బ్రహ్మ బి. విఠలాచార్య దర్శకత్వంలో కరుణించిన కనకదుర్గ, శ్వేత నాగు. అరణ్యదల్లి, అభిమన్యు సినిమాలు గా రూపుదిద్దుకొని ప్రేక్షకుల మన్ననలు పొందాయి. వారి సినిమాలు టీవీల్లో కూడా ప్రచారం అయినాయి వారికి 5 అవార్డులు వచ్చాయి. లల్లాదేవి రచించిన 14 నవలలు కన్నడంలోకి అనువదించ బడి ధారావాహికంగా ప్రచురింపబడ్డాయి, ఇవి కాకుండా వారు అనేక రేడియో ప్రసంగాలు చేశాంరు. తిరుపతి తిరుమల దేవస్థానం ఆర్థిక సహాయంతో లల్లా రామాయణం, డబ్ల్యూహెచ్వో సమాచారం ఆధారంగా ఎయిడ్స్ నవల తదితర ప్రచురణలు జనాదరణ పొందినవి. ఇవే కాక వారు అనేగా చారితాత్మక రచనలు రచించి పలువురు అభిమానుల మన్ననాలు పొందారు. కాగా వారి భౌతిక కాయానికి శుక్రవారం అంత్యక్రియలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం జిల్లా నాయకులు మద్రి వెంకట శివయ్య, చెన్నుపాటి శివ నాగేశ్వరరావు, కుర్ర హరిబాబు లాంటి ప్రముఖులు, అభిమానులు, గ్రామస్తులు ఎందరో పాల్గొని లల్లాదేవి కి నివాళులర్పించారు.

## బాల్య వివాహం: 14 మందిపై కేసు నమోదు



**ఉమ్మడి గుంటూరు జిల్లా బ్యూరో (జర్నలిస్టు ఫైల్)** పల్నాడు జిల్లాలోని అచ్చంపేట మండలం కొండూరులో 16 ఏళ్ల మైనర్ బాలికకు వివాహం జరిపినందుకు పోలీసులు, చైల్డ్ వెల్ఫేర్ అధికారులు చర్యలు తీసుకున్నారు. పెళ్లికొడుకు, ఇరువైపులా తల్లిదండ్రులతో పాటు పురోహితుడు, ఫోటోగ్రాఫర్, మండపం నిర్వాహకుడు సహా 14 మందిపై పోలీసులు కేసు నమోదు చేశారు. బాలికను అదుపులోకి తీసుకుని శిశు సంక్షేమశాఖ హెూమ్కు తరలించారు. మైనర్ వివాహాలు జరిపితే కఠిన చర్యలు ఉంటాయని అధికారులు హెచ్చరించారు.

## గాంధీజీ భావాలతోనే దేశ ప్రగతి సాధ్యం : మాజీ మంత్రి.డొక్కా మాణిక్య వరప్రసాద్




**ఉమ్మడి గుంటూరు జిల్లా బ్యూరో (జర్నలిస్ట్ ఫైల్)** నేడు భారతదేశంలో గాంధీజీ భావాలను ఆచరిస్తేనే దేశం ప్రగతి పథాన పయనిస్తుందని మాజీ మంత్రివర్యులు డొక్కా మాణిక్య వరప్రసాద్ పేర్కొన్నారు. గురువారం గుంటూరులోని జనచైతన్య వేదిక హాలులో అమరావతి ఇన్స్టిట్యూట్ ఆఫ్ సోషల్ సైన్సెస్ ఆధ్వర్యంలో గాంధీజీ సమకాలీనతపై జరిగిన చర్చా గోష్టికి జనచైతన్య వేదిక రాష్ట్ర అధ్యక్షులు వల్లంరెడ్డి లక్ష్మణరెడ్డి అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన డొక్కా మాణిక్య వరప్రసాద్ ప్రసంగిస్తూ మహాత్మా గాంధీజీ 1910 లోనే తాను రచించిన హింద్ స్వరాజ్ పుస్తకంలో భారత దేశ భవిష్యత్తు ఎలా ఉండాలి, ఎలా నిర్మించుకోవాలనే అంశాలపై దిశా నిర్దేశం చేశారన్నారు. హిందూ ముస్లిం ఐక్యతపై పోరాడి అమరుడైనాడని, హిందూ మతోన్మాదులు నాలుగు సార్లు గాంధీ పై హత్యాయత్నాలు చేసి చివరకు సఫలీకృతులైనారన్నారు. సనాతనంలో ఆధునీకరణ నింపుకుని కోట్లాది ప్రజా సమూహాలను కదిలించి స్వాతంత్ర్య ఉద్యమాన్ని ప్రజా బాహుల్యం లోకి తీసుకెళ్లిన ఘనత గాంధీజీకి దక్కిందన్నారు. మాజీ శాసనమండలి సభ్యులు కె. ఎస్. లక్ష్మణరావు ప్రసంగిస్తూ గాంధీ మహాత్ముని పై విషం కక్కుతూ, వ్యక్తిగత విమర్శలు చేస్తూ అగౌరవ పరుస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. 1915 కు ముందు కొద్దిమంది మేధావుల ,విద్యావంతుల నేతృత్వంలో జరిగిన స్వాతంత్ర్య ఉద్యమాన్ని గాంధీజీ కోట్లాది ప్రజలను భాగస్వామ్యం చేశారన్నారు. 1921 సహాయ నిరాకరణ ఉద్యమం, 1930 దండి సత్యాగ్రహం, 1942 క్విట్ ఇండియా ఉద్యమాల ద్వారా కోట్లాదిమంది ప్రజలను కదిలించి ,స్వాతంత్ర్య సాధనకు పునాది వేసిన మహనీయులని కొనియాడారు. జనచైతన్య వేదిక రాష్ట్ర అధ్యక్షులు వల్లంరెడ్డి లక్ష్మణరెడ్డి ప్రసంగిస్తూ నాడు గాంధీజీ ఆశించిన గ్రామ స్వరాజ్, మత్తు పానీయాల నిరోధం, అభివృద్ధి వికేంద్రీకరణ, ఆర్థిక అసమానతల తగ్గింపు లాంటివి అమలు కాక పోగా ఆర్థిక అసమానతలు పెరిగాయని, రాష్ట్ర ప్రభుత్వాలు మద్యం అమ్మకాలను ప్రోత్సహిస్తున్నాయని, రాజకీయాల్లో అవినీతి అగ్రస్థానానికి చేరిందని వివరించారు. నాడు గాంధీజీ లాంటి నేతలు త్యాగాలకు ప్రతిబింబాలుగా ఉండగా నేడు 80 శాతం పైగా రాజకీయ నేతలు అవినీతిపరులు గాను, నేరస్థులు గాను చట్టసభల్లో కొనసాగడం బాధాకరమన్నారు. ప్రముఖ విద్యావేత్త ప్రొఫెసర్ డి.ఏ.ఆర్. సుబ్రహ్మణ్యం ప్రసంగిస్తూ గాంధీజీ అహింసా, సత్యాలను ఆయుధాలుగా మలుచుకుని నా జీవితమే నా సందేశం అని చెబుతూ త్రికరణ శుద్ధిగా ఉద్యమించి, స్వాతంత్ర్యాన్ని సాధించి జాతిపితగా, మహాత్మాగా కోట్లాదిమంది హృదయాలలో నిలిచారన్నారు. ఐన్ స్టీన్, రవీంద్రనాథ్ ఠాగూర్, మార్టిన్ లూథర్ లాంటి మహనీయులు గాంధీజీ కృషిని ప్రపంచానికి తెలిపినారన్నారు. దళిత బహుజన ఫ్రంట్ వ్యవస్థాపకులు, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షులు కొరివి వినయ్ కుమార్ ప్రసంగిస్తూ ప్రపంచ దేశాల నాయకులు గాంధీజీని స్ఫూర్తిగా తీసుకున్నారని, అంతర్జాతీయంగా భారతదేశానికి అహింస సత్యాన్వేషణలతో గాంధీజీ గుర్తింపు తెచ్చిన మహనీయుడని కొనియాడారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు గాంధీజీ ఆశయాలను అమలు చేయడానికి కృషి చేయడం లేదన్నారు.

ఈ చర్చా గోష్టి లో సామాజిక విశ్లేషకులు టి. ధనుంజయ రెడ్డి, మాదిగ జనసేవా సమితి నేతలు పరంగి సత్యరాజు, నూతక్కి సతీష్, దాసరి జాన్ బాబు తదితరులు పాల్గొని ప్రసంగించారు.

INK OF TRUTH
జర్నలిస్ట్ ఫైల్
తెలుగు దినపత్రిక
జర్నలిస్ట్ ఫైల్ దినపత్రిక చందాదారులుగా చేరాలని అనుకుంటున్నారా?
అయితే ఈ నెంబర్‌కు ఫోన్ చేయండి
సర్క్యులేషన్ మేనేజర్
76 61 80 59 68

